విశాలాంధ్ర

ఏలూరు, పశ్చిమ గోదావరి
కాకినాడ, కోనసీమ
తూర్పుగోదావరి

శనివారం 02 ఆగస్టు 2025   8 పేజీలు

డిజిటల్ వద్దు... నగదు ముద్దు

- కార్పొరేట్ ఆసుపత్రుల హవా
- సేవ పేరుతో ఆసుపత్రుల దందా
- బ్యాంకు లావాదేవీలు వద్దంటున్న ఆసుపత్రి యాజమాన్యాలు
- చోద్యం చూస్తున్న వైద్య ఆరోగ్యశాఖ

జిల్లాలోని ప్రైవేటు,కార్పొరేట్ ఆసుపత్రులలో నగదు మాత్రమే తీసుకుంటున్నారు. డిజిటల్ లావాదేవీలు నిరాకరిస్తున్నారు.డబ్బులు నేరుగా ఇవ్వకపోతే వైద్యం చేయడం కుదరదు అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. పేద రోగులను నిత్యం దోపిడీకి గురి చేస్తున్నారు.కార్పొరేట్ ఆసుపత్రులలో తమ లాభసాటి వ్యాపారాన్ని పెంపొందించుకుంటూ కోట్ల రూపాయలకు పడగలెత్తుతున్నారు. జిల్లాలో కార్పొరేట్ ఆసుపత్రులలో రోజుకు రూ.కోట్లు వసూలు చేస్తూ దోపిడీ చేస్తున్నా అధికార యంత్రాంగం, ఆదాయపు పన్ను శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదు.

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: దేశంలో విద్య, వైద్యం వ్యాపారం కాదు. ఇది అందరికీ తెలిసిన నమ్మలేని అబద్ధం. కానీ సామాన్య ప్రజల వద్ద నుండి పన్నుల రూపంలో ఎన్నో కోట్ల రూపాయలు వసూలు చేస్తూ వైద్యులను తయారు చేస్తుంది. దీనిలో ప్రధానంగా వైద్యం పేరుకు మాత్రమే సేవ అన్న పదంతో మొదలై సామాన్య పేదల నుండి లక్షల రూపాయలు వసూలు చేస్తున్నా కొంతమంది వైద్యులు తమ దందాను కొనసాగిస్తున్నారు. ప్రభుత్వ నియమాల ప్రకారం ఒక వైద్యుడు తయారవ్వాలంటే పేద ప్రజల కష్టాల నుండి వచ్చిన పన్ను రూపంలో ఏర్పడి వైద్యుడిని తయారు చేస్తుంది.ఇదంతా పుస్తకాలలో ఉంటుంది. కానీ క్షేత్రస్థాయిలో మాత్రం ఆ దిశగా అడుగులు పడటం లేదు. సామాన్య ప్రజల కష్టం నుండి ఏర్పడే నగదుతో ఈ దేశంలో తయారైన వైద్యులు మాత్రం ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం నిర్వహిస్తూ పేద ప్రజలను నిత్యం దోపిడీకి గురి చేస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సుమారు 400కు పైగా ప్రైవేట్ ఆసుపత్రులు ఉన్నాయి.కార్పొరేట్ ఆసుపత్రులు సైతం వందల సంఖ్యలో రోజురోజుకు పెరుగుతూ వస్తున్నాయి. ప్రతినిత్యం మారుమూల ప్రైవేటు ఆసుపత్రుల వైద్యం కోసం వేలాది మంది ▶మిగతా 2లో..

నేడు ఉపాధ్యాయ సంఘాల నిరసన

- జయప్రదం చేయండి :

ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు
కె.సత్తిబాబు

విశాలాంధ్ర - అమలాపురం : ఈనెల 2న జిల్లా కలెక్టరేట్ ఎదుట ఫ్యాప్టో ఇతర ఉపాధ్యాయసంఘాల ఆధ్వర్యంలో జరుగు ధర్నాలు జయప్రదం చేయాలని, దీనికి ఏఐటీయూసీ మద్దతు తెలియజేస్తుందని ఏఐటీయూసీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు కె. సత్తిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఈఓ పోస్టులను కామన్ సీనియారిటీ ప్రాతిపదికన ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఏకీకృత సర్వీస్ రూల్స్ సమస్యలు పరిష్కరించాలని, జీవో నెంబర్ 72,73,74లు వెంటనే రద్దు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో ప్లస్ 2 ఉపాధ్యాయుల నియామకాలు యథాతథంగా కొనసాగించాలని, పంచాయతీరాజ్‌లో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కలెక్టర్ ద్వారా పోస్టింగులు ▶మిగతా 2లో..

నేడు అన్నదాత సుఖీభవ -పీఎం కిసాన్ యోజన

రైతు ఖాతాకు జమ

విశాలాంధ్ర - నిడదవోలు : సూపర్ సిక్స్ హామీల్లో మరో హామీని అమలు చేస్తూ ఆగస్టు 2న తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు నియోజకవర్గంలోని అర్హులైన 19,317 మంది రైతన్నల ఖాతాల్లో పెట్టుబడి సాయంగా అన్నదాత సుఖీభవ - పీఎం కిసాన్ యోజన క్రింద తొలివిడతగా రూ.13.52 కోట్ల నిధులు నేరుగా జమ చేస్తున్నట్లు మంత్రి కందుల దుర్గేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన ప్రతి రైతన్న బ్యాంకు ఖాతాల్లో కేంద్ర ప్రభుత్వ వాటాగా 2 వేలు, రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.5 వేలు కలిపి మొత్తం రూ.7 వేల రూపాయలను నేరుగా జమ చేయనున్నట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. అందులో భాగంగా నిడదవోలు నియోజకవర్గంలోని నిడదవోలు రూరల్ మండలంలో 7731 మంది రైతులకు రూ.5.41 కోట్లు, పెరవలి మండలంలో 7022 మంది రైతులకు రూ.4.91 కోట్లు, ఉండ్రాజవరం మండలంలో 4564 మంది అర్హులైన రైతన్నలకు రూ.3.19 కోట్లు నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నామన్నారు. ఇందులో ▶మిగతా 2లో..

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

సంక్షేమ బోర్డు ద్వారా పథకాల అమలుపై పోస్టుకార్డు ఉద్యమం

విశాలాంధ్ర - కాకినాడ : ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ అనుబంధ సంఘం) రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శుక్రవారం కాకినాడలో భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు సూరిబాబు అధ్యక్షతన స్థానిక శారదాదేవి గుడి వద్ద భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని పోస్ట్ కార్డు ఉద్యమం ప్రారంభించారు. దీనికి ముఖ్య అతిథిగా ఏపీ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్ హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు

ద్వారా సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు పోస్ట్ కార్డు ద్వారా భవన నిర్మాణ కార్మికుల ఆవేదన, వారి సమస్యలను తెలియజేసేందుకు ఈ లేఖలో రాయిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలను పవన్ కళ్యాణ్ వెంటనే అమలు చేయాలని, సంక్షేమ బోర్డుకు కోటి రూపాయలు ఇస్తానన్న హామీని తక్షణమే అమలు చేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. ఎన్డీఏ కూటమి ఏర్పడి సంవత్సరం కాలం పూర్తయినా భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా ▶మిగతా 2లో..

5న ధర్నా జయప్రదం చేయాలి

ప్రజా సంఘాల ఐక్యకార్యాచరణ వేదిక

విశాలాంధ్ర ఏలూరు: స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 5న విద్యుత్ కార్యాలయం వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. నగరంలో రెండవ పట్టణం పత్తేబాద్ ఏరియాలో స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ ప్రజాసంఘాల ఐక్య కార్యాచరణ వేదిక ఆధ్వర్యంలో పత్తేబాద రైతు బజార్ సెంటర్ నుండి ప్రజా సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సీపీఐ ఏలూరు ఏరియా సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్, ఐఎఫ్టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, సీపీఎం నగర కార్యదర్శి పంపన రవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మరింత దోపిడీ చేయాలనే దురుద్దేశంతో స్మార్ట్ మీటర్లను ▶మిగతా 2లో..

కొత్తగా 183 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు

విశాలాంధ్ర - కాకినాడ : ఎన్నికల కమిషన్ ఆదేశాల కనుగుణంగా జిల్లాలో క్రొత్తగా మరో 183 పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదించామని జిల్లా రెవెన్యూ అధికారి జె. వెంకట్రావు తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ కోర్టు హాలులో జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు, రిజిష్టర్డ్ అన్ రికగ్నైజ్డు పార్టీల ప్రతినిధులు, నియోజకవర్గాల ఏఈఆర్ఓలతో సమావేశం నిర్వహించి జిల్లాలో పోలింగ్ స్టేషన్ల రీఆర్గనైజేషన్ ప్రక్రియ క్రింద కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, పోలింగ్ కేంద్రాల లొకేషన్లు, పేర్ల మార్పుల కొరకు సిద్ధం చేసిన ప్రతిపాదనలను వివరించి, రాజకీయ పార్టీల సూచనలు, సలహాలను కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ▶మిగతా 4లో..

అర్హులందరికీ పింఛన్లు

- ఏలూరు జిల్లాలో కొత్తగా 4,358 స్పౌజ్ పెన్షన్లు
- పింఛన్ల పంపిణీ పరిశీలించిన కలెక్టర్ కె.వెట్రిసెల్వి

విశాలాంధ్ర-ఏలూరు: ప్రభుత్వం మంచి లక్ష్యంతో అందిస్తున్న ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలిపారు. శుక్రవారం ఏలూరు నగరం లోని 37,38 డివిజన్లలోని ఆర్.ఆర్. పేట, గుబ్బలవారి వీధిలో ఎన్.టి.ఆర్. భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించి నేరుగా పలువురు లబ్ధిదారుల ఇంటివద్దకే వెళ్లి పింఛన్లు ▶మిగతా 2లో..

సాకారం దాల్చనున్న కలెక్టర్ హామీ

విశాలాంధ్ర - ఉంగుటూరు : ఇచ్చిన మాటను నిలబెట్టుకొని ఉంగుటూరు మండలం చేబ్రోలు గ్రామంలోని ఉర్దూ పాఠశాల ప్రహరీ గోడకు రూ. 4 లక్షల నిధులు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వి మంజూరు

చేశారు. జులై 19వ తేదీన చేబ్రోలు ఉర్దూ పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలకు ప్రహరీ గోడ లేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ ప్రతిపాదన పంపాలని అధికారులకు ఆదేశించారు. ప్రతిపాదనలు పంపడంతో రు. 4 లక్షల నిధులు మంజూరయ్యాయని ఎంపీడీవో గంజి రాజు మనోజ్ తెలిపారు. దీంతో పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ సమస్య పరిష్కారమైంది. ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కలెక్టర్ కు సర్పంచి రాందే లక్ష్మి సునీత, విద్యార్థులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర - గణపవరం: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉంగుటూరు శాసనసభ్యులు పత్సమట్ల ధర్మ

రాజు అన్నారు. గణపవరం గ్రామంలో శుక్రవారం స్పౌజ్ పెన్షన్ లబ్దిదారుల ఇంటికి నేరుగా వెళ్లి పెన్షన్ సొమ్మును అందజేశారు.

రాష్ట్రంలో అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన అన్నారు.స్పౌజ్ పెన్షన్ కేటగిరి కింద కుటుంబంలో పింఛన్ అందే భర్త చనిపోయిన తర్వాత అయన మరణ ధ్రువీకరణ పత్రం సమర్పించిన వెంటనే భార్యకు కొత్తగా పింఛన్ మంజూరు అయ్యే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలో కొత్తగా 557 మంది స్పౌజ్ పెన్షన్ లబ్దిదారులు ఉన్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, ఎంపీడీవో ఆర్. బేబీ శ్రీలక్ష్మి, డిప్యూటీ ఎంపీడీవో పల్లి వెంకట సత్యనారాయణ, తోట శ్రీను, కూసంపూడి సురేంద్ర కుమార్ రాజు, గ్రామ పంచాయతీ కార్యదర్శి దార్ల శివరాం ప్రసాద్, గ్రేడ్1, జనసేన, టీడీపీ, బీజేపీ ముఖ్య నాయకులు, మండల అధ్యక్షులు, గ్రామ అధ్యక్షులు, కార్యకర్తలు, వీర మహిళలు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఖాతాకు జమ (1వ పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ.9.65 కోట్లు కాగా, కేంద్ర ప్రభుత్వ వాటా రూ.3.8 కోట్లని మంత్రి కందుల దుర్గేష్ వివరించారు. అర్హులై ఉండి నగదు జమ కాని రైతులెవరైనా ఉంటే ఆందోళన అవసరం లేదని నిధుల జమ విషయంలో ఏమైనా సందేశాలు, సమస్యలు ఉంటే 155251 కాల్ సెంటర్ కు లేదా 9552300003 వాట్సాప్ గవర్నెన్స్ నంబర్ కు ఫోన్ చేయాలన్నారు. స్థానిక రైతు సేవా కేంద్రాలను సంప్రదించవచ్చని మంత్రి కందుల దుర్గేష్ స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు.

నిరసన (1వ పేజీ తరువాయి)

ఇవ్వాలని, అంతర్ జిల్లాల బదిలీలు చేపట్టాలని, 12వ వేతన సవరణ సంఘాన్ని ఏర్పాటు చేయాలని, 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని, పదవీ విరమణ పొందిన వారికి ఆర్థిక బకాయిలు తక్షణమే చెల్లించాలని, సీపీయస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు పిలుపునిచ్చారు. పై సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఏపిటీయూసి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు కె. సత్తిబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

జయప్రదం చేయాలి (1వ పేజీ తరువాయి)

బిగిస్తుందని విమర్శించారు. ప్రభుత్వాలు ఆదానితో ఒప్పందం కుదుర్చుకుని స్మార్ట్ అనే పేరుపై స్మార్ట్ గా ప్రజల ఆస్తులను దోచుకునే విధంగా ఆదానికి అప్పచెప్పే విధానాన్ని మోడీ, బాబు సర్కార్లు ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని అన్నారు. ఈనెల 5న జిల్లా విద్యుత్ భవనం వద్ద ధర్నాను ప్రజలు, ప్రజాస్వామిక వాదులు జయ ప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్ర మంలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బండి వెంకటేశ్వరావు, ఏఐటియుసి జిల్లా కోశాధికారి పుప్పాల కన్నబాబు, మహిళా సమాఖ్య నగర అధ్యక్షురాలు కొండేటి బేబి, సహాయ కార్యదర్శి కొల్లూరి సుధారాణి,గొర్లి స్వాతి, ఉప్పులూరి లక్ష్మి,సాయన అఖిలేష్, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షులు కాకినాని,రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, సిఐటియు పట్టణ కార్యదర్శి కనకరాజు, ఎం. ఇస్సాకు,వెదురుపర్తి శారద, లక్కోజు జగదీశ్వరి,ఏపీ ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఏలూరు నగర సెక్రటరీ నవుడు నెహ్రూ బాబు, చంద్రశేఖర్, పల్లి గంగరాజు, పిల్లి రాజు, గుర్తితి లోవరాజు, లోవరాజు, ముదుపాక లక్ష్మీ, కుప్ప రాజు, చేపూరి ఈరన్న, పి.గోవర్ధన్, పల్లి యేసు, కే. విజయ్, సత్యనారాయణ,కొంపంగి కృష్ణ, కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు (1వ పేజీ తరువాయి)

పంపిణీ చేశారు. పింఛనుదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇంటివద్దకే వచ్చి పెన్షన్లు అందజేయడంపట్ల లబ్ధిదారులు తమ సంతోషం వ్యక్తంచేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పింఛన్లను పెద్దమొత్తంలో పెంచి అండగా నిలిచిందని లబ్ధిదారులకు వివరించారు. ఆగస్టు మాసపు ఎన్.టీ.ఆర్. భరోసా పింఛన్లు అందించే క్రమంలో జిల్లాలో ఉన్న 2,61,592 మంది పింఛనుదారులకు ప్రభుత్వం రూ. 114.25 కోట్లు విడుదల చేసిందన్నారు. పింఛన్ల పంపిణీకి 5,292 మంది సిబ్బంది ఉదయం 7.00 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టారన్నారు. ఆగస్టు 1వ తేదీన పింఛన్లు ఏదైనా కారణం చేత తీసుకోని వారికి ఆగస్టు 2వ తేదీ శనివారం పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఆగస్టు నెల నుంచి కొత్తగా 4,358 స్పౌజ్ పెన్షన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని, వాటిని కూడా ఈనెలలో పంపిణీచేయనున్నట్టు తెలిపారు. వీరి వెంట డిఆర్డిఏ పిడి ఆర్.విజయరాజు,మున్సిపల్ కమిషనరు ఎ. భానుప్రతాప్, తహశీల్దారు గాయత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయుడు సోము,ఈతకోట శ్రీనివాసరావు, ఎస్.దుర్గాప్రసాద్,తదితరులు ఉన్నారు.

అమలు చేయాలి

(1వ పేజీ తరువాయి)

విఫలమైందన్నారు. నిర్మాణంలో వసూలు చేస్తున్న 1 శాతం నిధులు ప్రభుత్వం దుర్వినియోగిస్తుందని, ఇప్పటికైనా తమ నిధులు తమకే ఖర్చు చేయాలని, వాడుకున్న నిధులు తిరిగి సంక్షేమ బోర్డుకి జమ చేయాలని, యాక్సిడెంట్ క్లైమ్, సాధారణ మరణం, డెలివరీ, మ్యారేజ్ గిఫ్ట్, హాస్పిటలైజేషన్ తదితర క్లైమ్స్ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 60 సంవత్సరాలు నిండిన ప్రతి భవన నిర్మాణ కార్మికుడికి వృద్ధాప్య పెన్షన్ రూ.5000 మంజూరు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు ప్రైవేట్ స్కూల్లో ప్రత్యేక రాయితీ కల్పించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్ర మంలో కె. శ్రీను, కె.రాము, సురేంద్ర, భాను, ప్రకాష్, సాగర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నగదు ముద్దు

(1వ పేజీ తరువాయి)

రోగులు తమ తమ స్థాయిని బట్టి ప్రైవేటు ఆసుపత్రికి చేరుకుంటున్నారు. రోగాన్ని బట్టి చికిత్సను బట్టి ప్రతినిత్యం లక్షల రూపా యలు వసూలు చేస్తున్నారు. ఈ నగదు అంతా కేవలం చేయి మార్పిడి వల్లనే జరుగుతుంది. మిగిలిన అన్ని విభాగాల లోనూ దేశం నలుమూలల పది సంవత్సరాల నుండి డిజిటల్ బ్యాంకింగ్ జరుగుతుంటే కేవలం ఆసుపత్రుల్లో మాత్రం డిజిటల్ నగదును అనుమతించడం లేదు. అధునాతనమైన వైద్యం అంటూ ఊదరగొట్టే ఆసుపత్రులు నగదు చలామణి విషయంలో డిజిటల్ నగదును ప్రోత్సహించడం లేదు. దీనికి ప్రధాన కారణం ఆదాయం లెక్కలలో చూపిస్తే నేరుగా దొరికిపోతామనే నెపంతో దొంగ బిల్లులను ఆశ్రయిస్తూ తమ ఇష్టానుసారంగా దోచేస్తున్నారు. ప్రతినిత్యం జిల్లా వ్యాప్తంగా కోట్ల రూపాయలలో ఆసుపత్రి వ్యాపారం జోరుగా సాగుతుంది. ప్రతి ఒక్క వ్యాపారంలోను ఆదాయ పన్ను అధికారులు బ్యాంకు లావాదేవీని ఆధారంగా చేసుకుని వారిపై పన్ను వసూలు చేస్తారు. కానీ దానికి పూర్తి విరుద్ధంగా వైద్యరంగంలో మాత్రం కన్నెత్తి కూడా చూడకపోవటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రధానంగా ఈ వైద్య విభాగంలో వెన్నెముకగా రాజకీయ అండదండలు పుష్కలంగా ఉండటం..అందుకే ఈ విభాగం వైపు ఆదాయపు పన్ను శాఖ అధికారులు కన్నెత్తి కూడా చూడటం లేదని చెప్పకనే చెబుతుంది. ఇదే అదునుగా రోగుల వద్ద నుండి కేవలం నగదు మాత్రమే తీసుకుంటూ డిజిటల్ మనీ వద్దని వైద్యులు తెలుపుతున్నారు. ఆసుపత్రి బిల్లులు ప్రత్యేకంగా మందుల దుకాణంలో మరొక రకం వైద్య పరీక్షలు ఇంకొక లావాదేవీలతో రకరకాల మోసాలు నిర్వహిస్తూ భారీ దోపిడీకి తెరతీస్తున్నారు. లాభసాటి వ్యాపారంగా వైద్యాన్ని మార్చేయడంతో వైద్యుడు కావాలంటే అర్హతను బట్టి కాక కోట్ల రూపాయలను కుమ్మరించి మెడికల్ సీటును కొనుగోలు చేస్తూ డాక్టర్లు తయారవుతున్నారు. ఆ నగదును రెండింతలుగా లాభసాటిగా సంపాదించడానికి ఈ రంగాన్ని పూర్తిగా వాడుకుంటున్నారు.జిల్లాలో చిన్న స్థాయి ప్రైవేటు ఆసుపత్రి నుండి మల్టీ స్పెషాలిటీ కార్పొరేట్ ఆసుపత్రి వరకు డిజిటల్ మనీ వద్దని,కేవలం నగదు మాత్రమే ఇవ్వాలని రోగులను ఇబ్బంది పెడుతున్నారు. చివరకు ఆసుపత్రిలో ఓపి వద్దనుండి మందుల బిల్లుల వరకు డిజిటల్ వద్దని 80 శాతం మంది ఆసుపత్రి యాజమాన్యాలు తెలుపుతున్నాయి.ఇదంతా ఒక ఎత్తు అయితే ప్రైవేటు ఆసుపత్రులలో లెక్కలు చూపించాలంటే లక్షలలో రోజుకు వ్యాపారం జరుగుతున్నా వార్షిక ఆదాయం మాత్రం వేలల్లో చూపిస్తుంటారు. వైద్యాధికారులు కూడా వైద్య పరీక్షలు,రోగ నిర్ధారణ పరీక్షలపై నియమిత రేటు ఉండాల్సిన అవసరం ఉన్నా ఏ ఒక్క ప్రైవేటు ఆసుపత్రిలో నమూనా పట్టిక ఉండకపోవటం అధికారుల తీరును బట్ట బయలు చేస్తుంది.ప్రభుత్వ నియమాల ప్రకారం నియమిత రేటు కే వైద్య పరీక్షలు నిర్వహించాల్సి ఉంటే ఆ నియమాలు తుంగలో తొక్కి వేల రూపాయలలో ఫీజులు వసూలు చేస్తున్నారు.ఇవేవీ పట్టనట్టు వైద్యాధికారులు తమ వార్షిక మామూళ్లతో మిన్నకుండి పోవడం ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవడం పూర్తిగా మానివేశారు. ఆదాయ పన్ను శాఖ అధికారులు కూడా ప్రైవేటు ఆసుపత్రుల దందాపై శీత కన్ను వేశారు. ఇప్పటికైనా రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేటు ఆసుపత్రుల దందాపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రులలో కూడా డిజిటల్ నగదును అమలు అయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సామాన్య ప్రజలు కోరుకుంటున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అధికారులు పనిచేయాలి : కలెక్టర్

విశాలాంధ్ర-ఏలూరు: నగరంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ప్రాంతాల్లో స్థానిక సమస్యలను కలెక్టర్ కె. వెట్రిసెల్వి అడిగి

తెలుసుకున్నారు. శుక్రవారం ఆర్.ఆర్. పేట, గుబ్బలవారి వీధుల్లో పర్యటించిన కలెక్టర్ ప్రజలతో నేరుగా మాట్లాడి మంచినీటి సదుపాయం, డ్రైన్ల నిర్వహణ, కార్పొరేషన్ నుంచి రోజు చెత్త తీసుకువెళుతున్నారా లేదా తదితర అంశాలను అడిగితెలుసుకున్నారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రభుత్వం కృషిచేస్తుందని అన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనరు ఎ. భానుప్రతాప్, తహశీల్దారు గాయత్రి, స్థానిక ప్రజా ప్రతినిధులు నాయుడు సోము, ఈతకోట శ్రీనివాసరావు, ఎస్.దుర్గాప్రసాద్ తదితరులు ఉన్నారు.

అర్హులందరికీ పింఛన్లు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రతినెల ఒకటవ తేదీన పింఛన్లు అందజేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదే అని టీడీపీ మండల అధ్యక్షుడు పారేపల్లి నరేష్ పేర్కొన్నారు.

మండలంలో బయ్యనగూడెం గ్రామంలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అర్హత కలిగిన పెన్షన్ దారులకు ప్రతి నెల ఒకటవ తేదీన ఎన్టీఆర్ పింఛన్లు అందజేయడం పట్ల వికలాంగులు, వృద్ధులు, హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మండలంలో అర్హత కలిగిన 180 మందికి వితంతు పెన్షన్లు వచ్చాయని, వాటిని ఒకటవ తేదీ శుక్రవారం కూటమి పార్టీల నాయకులతో, సచివాలయ సిబ్బందితో, కలసి ఇంటింటికి వెళ్లి అందజేసినట్టు నరేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మద్దు తేజ, బాలం నరేష్, ఆరేటి ఏసుబాబు, కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర -భీమవరం: తల్లిపాలు అమృతంతో సమానమని, వీటి ద్వారా బిడ్డకు అతి ముఖ్యమైన పోషకాలు లభిస్తాయని ప్రభుత్వ చైల్డ్ డెవలప్ మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ కె.లక్ష్మీకాంతం అన్నారు. సెయింట్ మేరీస్ ఆసుపత్రిలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను

శుక్రవారం ప్రారంభించారు. లక్ష్మికాంతం మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డ శరీరానికి, మెదడుకు కూడా పోషణను ఇస్తుందన్నారు. తల్లిపాలలో వున్న పోషక గుణాలు మరి ఏ ఇతర పాలల్లో వుండవని స్పష్టం చేశారు. తల్లిపాలు శిశువును న్యుమోనియా, అతిసార వంటి ప్రమాదకరమైన వ్యాధుల నుండి కాపాడుతుందని అన్నారు. ఆసుపత్రి ప్రధాన వైద్యులు డాక్టర్ గ్రెసియా, డాక్టర్ సింధు, డాక్టర్ సిమిలి మాట్లాడుతూ పుట్టిన గంటలోపు బిడ్డకు తల్లి పాలు పట్టడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బిడ్డకు 6 నెలలు పూర్తయ్యే వరకు కేవలం తల్లిపాలు మాత్రమే తాగించాలని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఎక్కువగా ఆకుకూరలు తింటే ఆరోగ్యంగా ఉండడంతో పాటు లోపల పుట్టబోయే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటారని, ఈ వారోత్సవాల్లో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని అన్నారు. కార్యక్రమంలో సిస్టర్ అనీత్, సిస్టర్ అర్మద, సిస్టర్ సెలిన్, లిస్సి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో సమస్యల పరిష్కారం

విశాలాంధ్ర - ఉంగుటూరు : జిల్లా కలెక్టర్ ఆదేశంతో అధికారులు అమలు చేయడంతో 190 నెంబర్ అంగన్‌వాడి కేంద్రంలో సమస్యలు పరిష్కారం అయ్యాయి. జులై 19వ తేదీన కలెక్టర్ అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేశారు. డ్రైనేజీలో పడకుండా పిట్టగోడలు, బాత్రూం తలుపులు ఏర్పాటు, నిరుపయోగంగా ఉన్న నీటి తొట్టె తొలగింపు, పిల్లలు వెళ్లడానికి మార్గం సమస్యలు తీరాయి. అంగన్‌వాడి కేంద్రానికి సున్నం వేసి ముస్తాబు చేశారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీతో అంగన్వాడి కేంద్రం అభివృద్ధి చెందింది.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం

విశాలాంధ్ర -భీమవరం: కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్ని సంక్షేమ పథకాలు ముందుకు తీసుకెళ్తున్నారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని బలుసుమూడి, నరసయ్య అగ్రహారంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తోట సీతారామలక్ష్మి మాట్లాడుతూ కూటమి సర్కారు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తుందని గుర్తు చేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు మాట్లాడుతూ భీమవరం పట్టణంలో నూతన పెన్షన్లు 203, ప్రస్తుత పెన్షన్లు సుమారు పదివేల మందికి ప్రతి నెల1వ తేదీన లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేస్తున్నామన్నారు. టిడిపి రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం వరుసగా అమలు చేసుకుంటూ వస్తున్నదన్నారు. కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షుడు మద్దుల రాము, కార్యదర్శి చెల్లబోయిన గోవింద్, పట్టణ మాజీ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, క్లస్టర్ ఇన్చార్జ్ పొత్తూరి బాపిరాజు, జనసేన,బీజెపి నాయకులు గణేష్, నాగరాజు టిడిపి నాయకులు గంటా త్రిమూర్తులు, కోళ్ల నాగబాబు, పాలా శ్రీరామదాసు చెల్లబోయిన సుబ్బారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

స్పౌజ్ పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర -లింగపాలెం: కొత్తగా మంజూరైన స్పౌజ్ పెన్షన్లను ఎమ్మెల్యే రోషన్ కుమార్ లింగపాలెంలో పంపిణీ చేశారు. లింగపాలెం మండలంలో 4వేలమందికి పెన్షన్లు ఇస్తుండగా స్పౌజ్ పెన్షన్లు 132 మంజూరు అయ్యాయి. పెన్షన్లకు రూ. 5.28లక్షలు నగదు ప్రభుత్వం ఇస్తుంది. ఎమ్మెల్యే ఇచ్చిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌ఘడ్ సీఎంను కలిసిన రాయంకుల

విశాలాంధ్ర -లింగపాలెం: ఛత్తీస్ ఘడ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయిని మతంగూడెంకు చెందిన కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాయంకుల చక్రధరరావు న్యూఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈకలయికలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఉన్నారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన పలు విషయాలపై చర్చించినట్లు చక్రధరరావు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ అన్యాయం

భీమవరంలో దళిత జేఏసీ ఆందోళన

విశాలాంధ్ర -భీమవరం: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా 2024 ఆగస్టు 1న సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా భీమవరం అంబేద్కర్ సెంటర్ లో శుక్రవారం మాల సంఘాల జేఏసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ధర్నాలో మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు నల్లి రాజేష్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో మాల సామాజిక వర్గానికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు వల్ల మాలలకు అన్ని రంగాల్లో అన్యాయంతోపాటు అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. జాతీయ కన్వీనర్ చీకటిపల్లి మంగరాజు మాట్లాడుతూ త్వరలో మాలలకు వ్యతిరేకంగా పని చేసే రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. మాల సంఘాల జేఏసి కన్వీనర్ గంటా సుందర్ కుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబర్ 3వ తేదీ కుప్పం నుంచి మాల సంఘాల ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ఈ పాదయాత్రను మాల సంఘాల నాయకులు, సభ్యులు జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ధర్నాలో జిల్లా అధ్యక్షులు గుండు నగేష్, సోడదాసి జయపాల్, కొండేటి లాజర్, వర్ధనపు మోషే, పెట్టేం శుభాకర్, గొల్ల రాజ్ కుమార్, ఉన్నమట్ల శామ్యూల్ రాజ్, కర్నె జోగయ్య, బందారు బాల సుందరం, పరువు వెంకటేశ్వరరావు, మర్రే సామ్యూల్, మట్టా చంద్రశేఖర్, ఆనంద్,పిల్ల డైమండ్ రాజు, పొన్నమండ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దే వద్దు

సీపీఐ సంతకాల సేకరణ

విశాలాంధ్ర - ఏలూరు: స్మార్ట్ మీటర్ల విధానాన్ని, బిగింపును నిరసిస్తూ కుక్కునూరు మండలంలో శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. స్మార్ట్ మీటర్లపై ప్రజల నుంచి అభిప్రాయాలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ కుక్కునూరు మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అదానీ వ్యాపారాలకు భరోసా ఇస్తూ స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను దగా చేస్తుందని అన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు తగ్గించి ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలుమాటలకే పరిమితం చేసి పెద్ద పెద్ద కార్పొరేట్ కంపెనీలతో కుమ్మక్కై ప్రజలను మోసగించిందన్నారు. ప్రజల్లో చైతన్యం కలిగి స్మార్ట్ మీటర్ల విధానాన్ని తిప్పికొట్టాలని ఆయన కోరారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలు,స్మార్ట్ మీటర్ల విధానం రద్దు చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా అధ్యక్షురాలు వరకా. శ్యామల,కుక్కునూరు సహాయ కార్యదర్శి కూరాకుల బాబూరావు పాల్గొన్నారు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

ప్రజా సంఘాల నేతలు డిమాండ్

విశాలాంధ్ర-టి నరసాపురం: ప్రజలపై దోపిడీ చేసేందుకు ప్రయత్నాలు చేపడుతున్న స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దుచేయాలని ప్రజాసంఘాల నేతలు బివిన్ సాగర్, గుడెల్లి వెంకట్రావు, కారం భాస్కర్ డిమాండ్ చేశారు. ప్రజలపై మోపుతున్న విద్యుత్ చార్జీలు నిలువు దోపిడి ఆపాలని, స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరుతూ ఆగస్టు 5న నిర్వహించే రాష్ట్ర వ్యాప్త ధర్నా విజయవంతం చేయాలని సిపిఐ, సిపిఎం, సిపిఎం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద నాయకులు ధర్నా పోస్టర్లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన ఎన్నికల హామీలను విస్మరించి అడ్డూ అదుపు లేకుండా విద్యుత్ చార్జీలు పెంచుతూ ప్రజలపై మోయలేని భారం మోపుతుందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగల గొట్టండని చెప్పి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో రెండు కోట్ల మందికి పాత మీటర్లు తొలగించి స్మార్ట్ మీటర్లు బిగించేందుకు చర్యలు చేపట్టి ప్రజలను మోసం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల పై ప్రభుత్వం మోపుతున్న విద్యుత్ చార్జీలు వెంటనే ఉపసంహరించుకోవాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న అన్ని మండల కేంద్రాల్లో జరిగే ధర్నా జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నేతలు కొండముచ్చు శ్రీనివాస రావు, బయ్యాగాని ఏకాంబరరావు, మడకం కుమారి, సుధారాణి, సిరిబత్తుల సీతారామయ్య, పూసం సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

విశాలాంధ్ర -చింతలపూడి: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా ప్రజావేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న సంతకాల సేకరణ 5వ రోజు పాత చింతలపూడి గ్రామంలో నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి సంతకాల సేకరణ చేపట్టారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నా జయప్రదం చేయాలని ఈ సందర్భంగా నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఆర్‌వి సత్యనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డి. సత్యనారాయణ, సిపిఐ మండల కార్యదర్శి తొర్లపాటి బాబు, సీపీఐ సీనియర్ నాయకులు బోడ వజ్రం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు కంచర్ల గురవయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దంతా కృష్ణ' వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ముల్లగిరి లాజరు తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - కలిదిండి: మండలంలో కొత్తగా మంజూరైన పింఛన్లను టీడీపీ మండల అధ్యక్షులు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి లబ్ధిదారులకు అందజేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద పింఛన్ల పంపిణీలో పాల్గొన్న వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వృద్ధులకు, వితంతువులకు, దివ్యాంగులకు పింఛన్లు పెంచి అండగా నిలిచారన్నారు. మండలంలో 103 మందికి వితంతు పింఛన్లు మంజూరయ్యాయని తెలిపారు. కలిదిండి గ్రామంలో 13 మందికి కొత్త పింఛన్లు మంజూరయ్యాయని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, సర్పంచి మని ముక్కుల మారుతి, ప్రసన్న, సత్తిరాజు, జాన్ రాజు, గుడివాడ ఫణి, పంచాయతీ కార్యదర్శి ఉదయ్ కుమార్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర - నరసాపురం: అభివృద్ధి తో పాటు ప్రజా ఆరోగ్యం పైన ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. నరసాపురం మున్సిపాలిటీలో పలు వార్డుల్లో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసిన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ చెక్కులను శుక్రవారం ఆయన స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. 5 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.4,44,789 చెక్కులు పంపిణీ చేసి మాట్లాడారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, గంటా కృష్ణ, నిప్పులేటి తారకరామారావు, మైల వసంతరావు, పోలిశెట్టి నళిని, కొప్పడ కృష్ణవేణి, తోట అరుణ, పోలిశెట్టి సాంబ, వల్లభ రెడ్డి రామకోటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన : మంత్రి పార్థసారథి

విశాలాంధ్ర - ఆగిరిపల్లి : ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అందించడమే కూటమి లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి

చెప్పారు. ఏలూరు జిల్లా అగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వృద్ధులను పెన్షన్ వస్తుందా, ఒకటవ తేదీ ఇంటికి వచ్చి పెన్షన్ ఇస్తున్నారా లేదా అడిగి తెలుసుకున్నారు. తల్లికి వందనం వచ్చిందా అని ప్రతీ ఇంటికి వెళ్లి మహిళలను మంత్రి అడిగారు.గ్రామంలో రోడ్లు, డ్రైనేజి సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఆగిరిపల్లి మండలంలో ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా ప్రజలకు మంత్రి పార్థసారధి హామీ ఇచ్చారు. మంత్రి వెంట వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రమాదకర స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

విశాలాంధ్ర-చాట్రాయి: ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని దానికోసం జరిగే ప్రజా ఉద్యమాలను జయప్రదం చేయాలని సీపీఐ నూజివీడు నియోజకవర్గ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ

పిలుపునిచ్చారు. శుక్రవారం చాట్రాయి మండలం చిన్నంపేట గ్రామంలో సీపీఐ నాయకులు కొమ్ము ఆనందం నివాసంలో కరపత్రం విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరుగు నిరసన కార్యక్రమం జయప్రదం చేయాలని కోరారు. గత వైసిపి ప్రభుత్వం 9 సార్లు విద్యుత్ చార్జీలు పెంచి రూ.32 వేల కోట్లు ప్రజలపై భారం వేసిందని, బాదుడే బాదుడు వంటి నిరసన కార్యక్రమం నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఇప్పుడు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ. 15 వేల కోట్లు ప్రజలపై భారం వేసిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రజలపై మోపుతున్న ట్రూఅప్ చార్జీలు,ఇంధన సర్దుబాటు చార్జీలను ఉపసంహరించు కోవాలని డిమాండ్ చేశారు. విద్యుత్ రంగాన్ని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేయకుండా రానున్న రోజుల్లో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు ఈవీ శ్రీనివాస్, కౌన్సిల్ సభ్యులు కొమ్ము ఆనంద్ పాల్గొన్నారు.

వితంతువులకు ఆర్థిక భరోసా

విశాలాంధ్ర - నరసాపురం: అర్హులైన ప్రతి వితంతువులకు సామాజిక ఫించన్లు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ప్రభుత్వ

విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. మున్సిపాలిటీలో నూతనంగా మంజూరైన వితంతువు పింఛన్లను లబ్ధిదారులకు శుక్రవారం ఇంటి వద్దకే వెళ్లి స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పింఛను పొందుతూ మరణించిన వృద్ధుల స్థానంలో వారి భార్యలకు మంజూరు చేశారన్నారు. పేదలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, జనసేన పట్టణ అధ్యక్షులు కోటిపల్లి వెంకటేశ్వరరావు, వలవల నాని, గంటా కృష్ణ, నిప్పులేటి తారకరామారావు, మైల వసంతరావు, పోలిశెట్టి నళిని, కొప్పాడ కృష్ణవేణి, తోట అరుణ, పోలిశెట్టి సాంబ,వల్లభ రెడ్డి రామకోటి తదితరులు పాల్గొన్నారు.

భవన కార్మికుల సంక్షేమ బోర్డు పునఃప్రారంభించాలి

విశాలాంధ్ర-తాడేపల్లిగూడెం: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పున : ప్రారంభించాలని భవన నిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ డిమాండ్ చేశారు. రూరల్ మండలం దువ్వ భవన నిర్మాణ కార్మిక సంఘం నెలవారీ వార్షిక సమావేశం జానపాముల శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర భవన నిర్మాణ కార్మిక సంఘం పిలుపు మేరకు దువ్వ భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ లకు పోస్ట్ కార్డుల ద్వారా వినతి తెలిపే ఉద్యమం నిర్వహించారు. దువ్వ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు జానపాముల శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డు వెంటనే ప్రారంభించాలని, బోర్డు సభ్యులను నియమించి బోర్డు సమావేశం చేయాలన్నారు. రాష్ట్రంలో 2021 నుండి ఇప్పటి వరకు ఉన్న పెండింగ్ క్లెయిమ్స్ మొత్తం క్లియర్ చేయాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో కార్మికుల నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు వార్డు, గ్రామ సచివాలయంలో నమోదు చేసేందుకు అవకాశం కల్పించాలన్నారు. వెల్ఫేర్ బోర్డులో నమోదైన కార్మికులకు వెంటనే గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలన్నారు.

వయోభారం లేదా అనా రోగ్యం కారణంగా పని నుంచి విరమించు కున్న కార్మికులకు భవన కార్మికుల వెల్ఫేర్ బోర్డు ద్వారా పెన్షన్ మంజూరు చేయాల న్నారు. ప్రమాదం వల్ల అనారోగ్యంతో మంచాన పడిన భవన కార్మికులకు ఈఎస్ఐ తరహాలో ఉచిత వైద్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పెంపకాపు గోపాలకృష్ణ, బండి శ్రీనివాస్, సెక్రెటరీ తలాల రామకృష్ణ, కోశాధికారి కట్టా శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు గడుగోలు శ్రీనివాస్, పెంటపాటి ధన శేఖర్, అడబాల నరసింహ, ఉల్లి చంద్ర రావు, శ్రీరాముల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి

ఇన్‌చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి

విశాలాంధ్ర- పాలకోడేరు : పాలకోడేరు మండలం గొరగనమూడి గ్రామంలో శుక్రవారం వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు స్థానిక జ్ఞానానంద సీనియర్ సిటిజన్స్ ఆశ్రమంలో ఇన్చార్జి జిల్లా కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి, ఆరోగ్య పరిస్థితి, పిల్లల చదువులు గురించి అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారుల ఇంటిలో మంచినీటి కుళాయి, కరెంటు సౌకర్యం, డ్రైనేజీ సదుపాయం ఉన్నది లేనిది పరిశీలించి ప్రభుత్వం తరపున వారి అవసరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మిండేలా వీరాస్వామి అనే యువకునికి ఐటిఐ మెకానికల్ విభాగంలో శిక్షణ ఇప్పించి ఉపాధి కల్పించాలని, గండికోట దుర్గ అనే యువతికి కుట్టు మిషన్ ఇప్పించాలని డి ఆర్ డి ఏ అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా స్థానిక పాత్రికేయులతో ఇన్చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛను పథకం కింద జిల్లాలో 2,26,995 మందికి పెన్షన్ ఉదయం 6.00 గంటల నుండి సచివాలయ సిబ్బంది ద్వారా పంపిణీ చేసినట్టు తెలిపారు. ఒక్క గొరగనమూడి గ్రామంలో 290 మంది వివిధ పెన్షన్ దారులకు రూ.12.13 లక్షలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్‌డిఏ పిడి ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డిపిఎం మురళీకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.వి.ఎస్ రాంప్రసాద్, వీఆర్వో కే.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి పి.సరళ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ రూరల్ కార్యాలయం తరలింపు

విశాలాంధ్ర - నరసాపురం: విద్యుత్ శాఖ రూరల్ సెక్షన్ కార్యాలయాన్ని నరసాపురం నుంచి సీతారామపురం మార్చినట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.మధు కుమార్ తెలిపారు.లైన్ ఇన్‌లైన్ అవుట్ వర్క్స్ నిమిత్తం ప్రస్తుతం ఉన్న ప్రదేశం నుంచి సీతారాంపురంలోని కొప్పర్రు రోడ్డులో ఉన్న సబ్ స్టేషన్ వద్దకు మార్చడం జరిగిందన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ప్రతిపాదనలు

(1వ పేజీ తరువాయి)

ఎన్నికల కమిషన్, రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు పోలింగ్ స్టేషన్‌కు గరిష్టంగా 1150 మంది ఓటర్లు ఉండేట్లు పునర్ వ్యవస్థీకరిస్తూ 183 పోలింగ్ కేంద్రాలను కొత్తగా ఏర్పాటుకు ప్రతిపాదించామని తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 1640 పోలింగ్ కేంద్రాలు ఉండగా కొత్త కేంద్రాల ఏర్పాటుతో ఈ సంఖ్య 1823కు పెరగనుందన్నారు. ఓటర్ల సౌలభ్యం, భవన అనుకూలతలను పరిగణలోకి తీసుకుని 81 పోలింగ్ కేంద్రాల లొకేషన్ల మార్పు, 228 పోలింగ్ కేంద్రాలకు పేర్ల మార్పులను ప్రతిపాదించామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల రీఆర్గనైజేషన్ కొరకు సిద్ధం చేసిన ప్రతిపాదనలపై ఇప్పటికే ఆయా నియోజక వర్గాల స్థాయిలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి ఈఆర్ఓలు వివరించినట్టు తెలిపారు.

పించన్లు సద్వినియోగం చేసుకోవాలి

ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్

విశాలాంధ్ర- చింతలపూడి: కూటమి ప్రభుత్వం సంక్షేమ ప్రభుత్వం అని చింతలపూడి నియోజకవర్గ శాసనసభ్యులు సొంగ రోషన్ కుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఎన్.టి.ఆర్. భరోసా పింఛన్లు

సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. శుక్రవారం చింతలపూడి మండలం రేచర్ల గ్రామంలో ఎన్.టి.ఆర్. భరోసా సామాజిక స్పౌజ్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. అనంతరం పించనుదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను, కుటుంబ వివరాలు అడిగి తెలుసుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో రేచర్ల చింతలపూడి వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డును గత ప్రభుత్వం గాలికి వదిలేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సంవత్సర కాలంలోనే ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం చింతలపూడి నుండి రేచర్ల గ్రామానికి సుమారు 5 కిలోమీటర్ల మేర నూతన తారు రోడ్డు ఏర్పాటు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులతోపాటు మండల అధికారులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెలుగు నింపడమే నిజమైన సంక్షేమం

విశాలాంధ్ర - కలిదిండి: ప్రజల జీవితాలలో వెలుగు నింపడమే నిజమైన సంక్షేమమని రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ అంద్రాజు

శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని మట్టగుంట గ్రామంలో కొత్తగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను కూటమి నేతలతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా చంద్రబాబునాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 1,09,155 మంది వితంతువులకు స్పౌజ్ కేటగిరీ కింద పింఛన్లు మంజూరు చేసిందని తెలిపారు. గతంలో భర్త పెన్షన్ పొందుతూ మరణిస్తే భార్యకు వితంతు పెన్షన్ రావడానికి నెలల తరబడి సమయం పట్టేదని నేడు కూటమి ప్రభుత్వం తీసుకున్న స్పౌజ్ కేటగిరీ ద్వారా వెంటనే పింఛన్ మంజూరు చేసి ఆ కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసి వైస్ చైర్మన్ నాగిడి వీర బ్రహం, తిరుమాని పాండురంగారావు, నాగరాజు, కోకా తాతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు బియ్యం సేకరణ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం శ్రీ చింతలపాటి వరప్రసాద మూర్తి రాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాలకు సంబంధించిన బెస్ట్ ప్రాక్టీసెస్‌లో భాగంగా గుప్పెడు బియ్యం సేకరణ

కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పాకలపాటి నిర్మల కుమారి అన్నారు. విద్యార్థులందరూ తప్పనిసరిగా ప్రతి చివరి శుక్రవారం గుప్పెడు బియ్యాన్ని తీసుకొని వచ్చి సామాజిక సేవలో భాగస్వాములవ్వాలని ఆమె కోరారు.ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాణి దుర్గ మాట్లాడుతూ కళాశాలలో చదువుతున్న రోజులలోనే విద్యార్థులు తప్పనిసరిగా ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని విద్యార్థులను కోరారు. సేకరించిన బియ్యాన్ని గణపవరం సమీప పరిసర గ్రామాల్లో పేదలైన వారికి ఉచితంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పంచిపెట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. స్వరూప రాణి, డాక్టర్ సిహెచ్ చైతన్య, కె.వి గణేష్ కుమార్, ఎన్‌వివిఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్ చైతన్య, డాక్టర్ జి. వెంకట్రావు, డాక్టర్ జి. వెంకటరమణ, డాక్టర్ షేక్ పర్వీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అవ్వ, తాతల్లో చిరునవ్వు చూడటమే లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - రాజానగరం : అవ్వ, తాతల్లో చిరునవ్వు చూడటమే ఎన్డిఏ కూటమి లక్ష్యమని నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ అన్నారు. మండల వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం ఉదయం 6 గంటల నుండే పింఛన్లు పంపిణీ ప్రారంభమైంది. దీనిలో భాగంగా మండలంలోని చక్రద్వారబంధం, కానవరం,నరేంద్రపురం, కలవచర్ల గ్రామాల్లో ఎంపీడీవో జెపి ఝాన్సీరాణి ఆధ్వర్యంలో జరిగిన ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామ కృష్ణ తొలుత చక్రద్వారబంధం గ్రామంలోని తలారి గంగమ్మ అనే వృద్ధురాలికి నూతనంగా మంజూరైన పింఛను అందజేసి, ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి తెల్లవారి తలుపుతట్టి మరీ పింఛన్లు అందించడం జరుగుతుందన్నారు. ఎంపిడివో జెపి ఝాన్సీరాణి మాట్లాడుతూ ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు రాజానగరం మండలంలో నూతనంగా అర్హులైన 256 మందికి రూ. 1,096,000లు మంజూరైనట్లు చెప్పారు. వీటిలో భాగంగా కానవరం గ్రామంలో 16, చక్రద్వార బంధంలో 13,కలవచర్లలో 15, నరేంద్రపురంలో 11 మందికి ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేయడం జరిగిందన్నారు. వీటితో పాటుగా ఇప్పటికే మండలంలో 15,370 మంది లబ్ధిదారులకు సంబంధించి రు:6,76,38,000 పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. సచివాలయం అధికారులు,రెవిన్యూ సిబ్బంది, వివిధ శాఖల సిబ్బంది సహకారంతో ఒక్క రోజులోనే దాదాపు తొంభై శాతం మందికి పింఛన్లు పంపిణీ పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమములో మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటేశ్వర్లు, చక్రద్వారబంధం గ్రామంలో నాయకులు సోడసాని త్రిమూర్తులు, నార్గని బంగారయ్య, ఆనందాల గోవింద్,కురుముళ్ల మహేష్ , పేపకాయల నాగేశ్వరరావు, సోడసాని శ్రీను, దాకరపు సూరిబాబు, మాదబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు అమృతాహారం

విశాలాంధ్ర - రాజానగరం : తల్లిపాలే బిడ్డకు అమృతాహారంగా ఉపయోగపడి శిశువులో వ్యాధి నిరోధక శక్తి పెంచుతాయని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సిహెచ్ వెంకటలక్ష్మి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రమైన రాజానగరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, జీఎస్ఎల్ బీఎస్సి నర్సింగ్ కళాశాల విద్యార్థులు సంయుక్తంగా కలిసి శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక పిహెచ్సి నుంచి ర్యాలీ చేపట్టి స్థానిక గాంధీ బొమ్మ కూడలి వద్ద మానవహారం చేపట్టారు. అలాగే తల్లి పాలు యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ సిహెచ్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ పిల్లలు పుట్టిన వెంటనే బిడ్డకు స్తన్యమివ్వడం చాలా అవసర మని, దీనిపై అవగాహన కల్పించేందుకే ఆగస్టు 1 నుంచి ఆగస్టు 7 వరకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. తల్లి పాలు తాగే శిశువులో వ్యాధి నిరోధకశక్తి పెరిగి వ్యాధులు తక్కువగా వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పిహెచ్ఎన్ మంగతాయారు, హెల్త్ సూపర్వైజర్ ఎన్ వివి రమణ, ఏఎన్ఎంలు, జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గీత ప్రవీణ,వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య కె.విజయ పల్లవి, ఎన్ ఎస్ ఎస్ అధికారి జి.మాలిని, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లో ఆహారం నాణ్యతగా ఉండాలి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : అన్న క్యాంటీన్లో పేదల కోసం తయారు చేసే ఆహారం నాణ్యతలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా, రుచిగా శుచిగా ఉండాలని అడిషినల్ కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్ ఏజెన్సీకి సూచించారు. జీఎస్టీ రోడ్డులోని అన్నా క్యాంటీన్ ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టోకెన్ కౌంటర్, డైనింగ్ ఏరియా, చేతులు శుభ్రం చేసుకొను ప్రదేశం, టాయిలెట్ లను పరిశీలిం చారు. భోజనం నాణ్యత ఎలా ఉన్నదో లబ్ధిదారు లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను క్యాంటీన్లోని క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా తెలియచేయవచ్చని పేర్కొన్నారు. మంచి ఆహ్లాదకర, పరిశుభ్రమైన వాతావరణంలో పేదలు భోజనం చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఈ సందర్భంగా అడిషినల్ కమిషనర్ పేర్కొన్నారు. క్యాంటీన్లో అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. అనంతరం దానవాయిపేటలో విస్తృతంగా పర్యటించారు. ప్రజలు సహకరించి.. స్వచ్ఛ రాజమహేంద్రవరం నిర్మాణంలో భాగస్వాములు కావాలని కోరారు.

పింఛన్లను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : ప్రభుత్వం మంచి లక్ష్యంతో అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సద్వినియోగం చేసుకోవాలని సెక్రటరీ శైలజ వల్లి సూచించారు. శుక్రవారం ఉదయం కోటిలింగాలపేట, మునిసిపల్ కాలనీలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించి, పలువురు లబ్ధిదారులకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పింఛన్లను అందజేశారు. ఈ సందర్భంగా పింఛనుదారులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయ సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పింఛన్ పంపిణీ చేస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకటో తేదీనే పింఛన్లు పంపిణీకి ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని సెక్రటరీ శైలజవల్లి పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు అందించే క్రమంలో నగరంలో 28,347 పింఛనుదారులకు ప్రభుత్వం రూ. 12.43 కోట్లు విడుదల చేసిందన్నారు. ఈ నెలలో 443 నూతన పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. శుక్రవారం సాయంత్రానికి 98 శాతం పింఛన్ల పంపిణీ జరిగినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో ఆయా వార్డు ఇంఛార్జిలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ చట్టాలపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - సీతానగరం: సైబర్, చట్టాల పై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని ఎస్సై డి రామ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలో కూనవరం గ్రామ పంచాయతీ పరిధిలో ప్రజలకు నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలతో పాటు చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై డి రామ్ కుమార్ మాట్లాడుతూ నేటి సమాజంలో పెరుగుతున్న పరిజ్ఞానానికి అనుగుణంగా నేరాల సైతం పెరుగుతున్నాయని అన్నారు. ఈ సైబర్ నేరాలకు పాల్పడే వ్యక్తులు కంప్యూటర్, స్మార్ట్ మొబైల్ ఫోన్ల ద్వారా నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు. వీటిని అరికట్టడం కోసం మన బ్యాంక్ వివరాలు, ఓటీపీలను గోప్యంగా ఉంచుకోవాలని అన్నారు. అలాగే చట్టాల గురించి కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. మన ఇంటిలో పిల్లలు చేస్తున్న పనులు పై నిఘా ఉంచడం ద్వారా వారిని చెడు వ్యసనాలకు దూరంగా ఉంచవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైన్ ఎస్సై బి. సురేష్, కానిస్టేబుల్ రాజా రమేష్ పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

బలవంతంగా స్మార్ట్ మీటర్లు పెట్టం : తిలక్ కుమార్

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : స్మార్ట్ మీటర్ల వల్ల అనేక లాభాలున్నాయని, వాటిని ఏర్పాటు చేసుకోమని ఎవ్వరినీ బలవంతం చేయమని ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ సూపరింటెండింగ్ ఇంజనీర్ కె.తిలక్ కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక గోదావరి గట్టుకు సమీపంలో ఉన్న సర్కిల్ కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల అవగాహనపై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ప్రసంగించారు. స్మార్ట్మీటర్లను హైఎండ్ వినియోగదారులకు మాత్రమే ఇస్తున్నామని, సామాన్యులను తాము బలవంతం పెట్టదలచుకోలేదన్నారు. అయితే స్మార్ట్ మీటర్ల వినియోగం వల్ల ఎన్ని లాభాలున్నాయో అందరూ తెలుసుకోవలసిన అవసరం ఉందన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టుకోవడం వల్ల ముందస్తుగా డబ్బు చెల్లించాలన్నది అపోహ మాత్రమేనన్నారు. ఇప్పటి వరకు సింగిల్ ఫేజ్ లో 44,646 స్మార్టు మీటర్లు ఏర్పాటు చేశామని వీరిలో పది శాతం మంది తమకు గతం కంటే అదనపు విద్యుత్ బిల్లులు వస్తున్నాయనలేదన్నారు. ప్రస్తుతం టెక్నాలజీ బాగా అభివృద్ధి చెందిందని, టెక్నాలజీకి అనుగుణంగా తమ సంస్థను మార్చుకోవాలన్న ఉద్దేశ్యంతోనే ఈ స్మార్ట్ మీటర్లు పెడుతున్నామన్నారు. ఈ స్మార్ట్ మీటర్ల ద్వారా లోటెట్జీ సమస్యలు ఉండవని, సిబ్బందితో సంబంధంలేకుండా ఓ డేటా బేస్ ప్రకారం వారికి క్షణాలలో సేవలందించడం జరుగుతుందన్నారు. ప్రతీ వినియోగదారుడు స్మార్ట్ మీటర్లపై ఉన్న అపోహలను తొలగించుకోవాలని ఆయన కోరారు. ఈ క్రమంలో రానున్న రోజులలో తమ సిబ్బందితో ప్రతి మండలంలో స్మార్ట్ మీటర్లపై అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ స్మార్ట్ మీటర్ల ద్వారా వినియోగదారులు విద్యుత్ ను ఎంత వాడుతున్నారో సులువుగా తెలుసుకోవచ్చని, వీటిలో ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ చెల్లింపులున్నాయని, అందువల్ల స్మార్టు మీటర్ల పై ఎలాంటి సందేహాలున్నా తమ సిబ్బందిని నేరుగా కలుసుకుని అవగాహన పెంచుకోవాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్స్) ఎన్. శామ్యూల్, డిఈ(ఎంఆర్ టి) ఎ. రాజశేఖర్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (టెక్నికల్) ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

రైతు కుటుంబం నుంచి కానిస్టేబుల్గా ఎంపిక

విశాలాంధ్ర - సీతానగరం: సామాన్య రైతు కుటుంబం నుంచి పోలీస్ కానిస్టేబుల్గా విజయం సాధించిన అభ్యర్థి మండలంలోని సింగవరం గ్రామ పంచాయతీలో నాగరత్నం కాలనీకి చెందిన ఓసి కులంకు చెందిన సత్తి శ్రీను, సత్తి పుష్పవతి ప్రథమ కుమారుడు సత్తి దుర్గా భవన్ శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా విడుదల అయినా కానిస్టేబుల్ రాత పరీక్షల్లో 131 మార్కులు సాధించి ఏపీ సివిల్ కానిస్టేబుల్ గా ఎంపిక అయ్యారు. అయితే ఇదే కుటుంబం నుండి బీఎస్ఎఫ్లో ఒక కుమారుడు ఇప్పటికే ఉద్యోగం సాధించి విధులు నిర్వహి స్తున్నారు. దుర్గా భవన్ మాట్లాడుతూ పట్టుదలతో రాత్రింబవళ్లు కష్టపడి కష్టపడి చదివి విజయం సాధించాను అని అన్నారు. నా విజయానికి నా కుటుంబ సభ్యులు ప్రోత్సాహం ప్రధాన పాత్ర పోషించిందిదన్నారు.

భవిత కేంద్రానికి గ్రీన్ మ్యాట్ అందజేత

విశాలాంధ్ర - కడియం : దివ్యాంగులైన (సి డబ్ల్యు ఎస్ ఎన్) పిల్లలకు ఆరోగ్యంతో పాటు జీవన ప్రమాణాలు మెరుగుకు భవిత కేంద్రాలు ఆసరాగా ఉంటున్నాయని టీవీసి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తాడాల విష్ణు చక్రవర్తి అన్నారు. కడియం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల భవిత కేంద్రానికి శుక్రవారం ఆయన విచ్చేసారు. బాల బాలికలకు అవసరమైన రూ.15 వేల విలువైన గ్రీన్ మ్యాట్ను భవితా కేంద్రానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిత కేంద్రంలోని బాలబాలికలకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరపీ వంటి వాటిలో శిక్షణ అందిస్తున్న ఐఆర్పీలు ఎన్ కృష్ణవేణి, ఎం లోవ కుమారిలను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాలకు రాలేని దివ్యాంగ పిల్లల కోసం ఉపాధ్యాయులు ప్రతి శనివారం వారి ఇంటి వద్దకే వెళ్లి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారని, అదేవిధంగా ప్రతి మంగళవారం భవిత కేంద్రంలోని దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఫిజియోథెరపీ క్లాసులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల అవసరాన్ని గుర్తించి గ్రీన్ మ్యాట్ బహూకరించిన చక్రవర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

ఉద్యోగులకు పదవీ విరమణ వీడ్కోలు

విశాలాంధ్ర - రాజమండ్రి సిటీ : సుదీర్ఘ కాలం విధులను సమర్థవంతంగా నిర్వహించిన సూపరింటెండెంట్ డి.ఎల్. గోపాలస్వామి, బిల్ కలెక్టర్ జి.వెంకటేశ్వరరావు పదవీ విరమణ కార్యక్రమం నగరపాలక సంస్థ కార్యాలయంలోని పీజీఆర్ఎస్ హాలులో గురువారం సాయంత్రం జరిగింది. పలువురు అధికారులు, తోటి ఉద్యోగులు ఇరువురిని ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. తదుపరి సన్మాన గ్రహీతలు ఇరువురు మాట్లాడుతూ, నగరపాలక సంస్థలో ఇన్నేళ్ల పాటు అధికారుల సహకారంతో, సహ ఉద్యోగుల తోడ్పాటుతో ఎటువంటి ఒడిదుడుకులు లేకుండా పనిచేసి నేడు స్వచ్ఛంద పదవీ విరమణ పొందటం చాలా సంతోషంగా ఉందన్నారు. సెక్రటరీ శైలజావల్లి, డిప్యూటీ డైరెక్టర్ రామారావు, రెవిన్యూ ఆఫీసర్ సిహెచ్ శ్రీనివాసరావు, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పెన్షన్ల అందజేత

విశాలాంధ్ర-దేవరపల్లి: దేవరపల్లి మండలంలో కొత్తగా స్పౌజ్ పెన్షన్లు విడుదల 194 మందికి 7 లక్షల 76 వేల రూపాయలు పింఛన్లు మంజూరయ్యాయని దేవరపల్లి ఇన్చార్జి ఎంపీడీవో వై రాజారావు తెలిపారు. శుక్రవారం నూతనంగా మంజూరైన పెన్షన్లను లబ్ధిదారులకు ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అర్హులైన వారికి వృద్ధులకు పెన్షన్ మంజూరు చేసిందని తెలిపారు. కొత్త వారికి ఇంటింటా తిరిగి ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షతెలుగుదేశం నాయకుడు ఉప్పులూరి రామారావు స్థానిక నాయకులు కూటమి నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

బుక్ ఆఫ్ రికార్డ్‌లో జీఎస్ఎల్ విద్యార్థికి చోటు అభినందనీయం

విశాలాంధ్ర - రాజానగరం : అతిచిన్న వయస్సులోనే మధుమేహం పై విశేషమైన అధ్యయనం చేసి 'పీర్-రివ్యూడ్ జర్నల్' కు పరిశోధనా పత్రాన్ని సమర్పించిన తమ కళాశాల విద్యార్థి గడుగొయ్యల గుణశ్రీ ఫణి అజయ్ కి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ లో చోటు దక్కడం అభినందనీయమని జీఎస్ఎల్ విద్య సంస్థలు అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు అన్నారు. మండలంలోని జీఎస్ఎల్ వైద్య కళాశాల నందు ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం అజయ్ మధుమేహం ఎఫ్ఈవి1 ప్లేట్‌లెట్ పారామీటర్ల పై ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ టి.కవిత మార్గదర్శకత్వంలో పరిశోధన చేశారన్నారు.ఇటీవలే సీఎంసీ వేలూరులో జరిగిన ఎండోక్రినాలజీ అంతర్జాతీయ సదస్సులో సమర్పించగా, సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురించబడింది అని చెప్పారు.దీంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్ తమ విద్యార్థిని వరించిందని చెప్పారు. 19 ఏళ్ల ప్రాయంలోనే ఇతంటి విజయం సాధించినందుకు శ్రీ ఫణి అజయ్‌ను జీఎస్ఎల్ విద్యా సంస్థలు అధినేత డాక్టర్ గన్ని భాస్కరరావు,మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గన్ని సందీప్,ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కె. మిశ్రా, వివిధ శాఖల అధిపతులు అభినందించారు.

సాంకేతిక పరిజ్ఞానానికి భాషా నైపుణ్యాలు అవసరం

విశాలాంధ్ర - రాజానగరం : ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి భాషా నైపుణ్యాలు సైతం అవసరమేనని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం (జిజియూ) ఛాన్సలర్ కెవివి సత్యనారాయణ రాజు (చైతన్య రాజు) అన్నారు. మండలంలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలో ఆంగ్ల భాష విభాగం ప్రవేశపెట్టిన కేం బ్రిడ్జి అందిస్తున్న ఇంగ్లీష్ సర్టిఫికేషన్ అండ్ అప్ స్కిల్ పరీక్షలో ఉత్తీర్ణులైన 9 మంది విద్యార్థులను జిజియూ ఛాన్సలర్ శుక్రవారం అభినందించారు. ఆయన మాట్లాడుతూ భావవ్యక్తీకరణను భాషా ద్వారా చక్కగా తెలియజే సేందుకు వీలవుతుందన్నారు. జిజియూలో కేంబ్రిడ్జ్ సర్టిఫికెట్ కోర్సును ప్రవేశపెట్టిన ఇంగ్లీషు విభాగాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిజియు ఇంగ్లీష్ విభాగ అధిపతి డాక్టర్ సంఘమిత్ర, అధ్యాపకులు శైలజ, మహాలక్ష్మి, పాండు, డీన్ డాక్టర్ బి.శ్రీనివాస్రరాజా తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబానికి అప్పన్న హస్తం

సీఎం సహాయనిధి రూ.4 లక్షల ఆర్థిక సాయం

విశాలాంధ్ర - సీతానగరం : అక్షర సేద్యం చేస్తూ ఇటీవలే అకాల మరణం చెందిన పాత్రికేయ కుటుంబాన్ని ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుంది. మండలంలోని రాపాక గ్రామంలో నివసిస్తూ వార్త దినపత్రిక విలేకరిగా చేస్తూ ప్రజల పక్షాన తన కలంతో ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ జీవనం సాగించిన గోలకోటి శివ ప్రసాద్ గత ఏప్రియల్ నెలలో అనారోగ్యం పాలై రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచిన సంగతి పాఠకులకు విదితమే. ఆరోగ్యశ్రీలోకి చికిత్స రాకపోవడంతో దాదాపు రూ.13 లక్షల వరకు ఆసుపత్రికి చెల్లించిన కుటుంబ సభ్యులు అప్పులపాలైపోయారు. దీంతో స్పందించిన నియోజకవర్గ శాసనసభ్యులు బత్తుల బలరామ కృష్ణ సిఫార్సు మేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుండి రూ. 4,37,925 ఆర్థిక సాయం మంజూరు అయ్యింది. దీంతో జనసేన నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి చేతులు మీదుగా చెక్కును విలేకరి కుటుంబ

సభ్యులకు శుక్రవారం అందజేశారు.

ఏపీడబ్ల్యూజే చొరవ అభినందనీయం

ఆరోగ్యశ్రీ పరిధిలోకి రానీ అతి క్లిష్టమైన అనారోగ్య సమస్యతో ఆసుపత్రిలో చేరిన సీతానగరం వార్త విలేకరి గోలకోటి శివ ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి దయనీయంగా మారడంతో అప్పట్లో విశాలాంధ్ర విలేకరి సతీష్ ద్వారా విషయం తెలుసుకున్న ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు, జిల్లా కన్వీనర్ మండెల శ్రీరామమూర్తి, రాష్ట్ర అధ్యక్షులు ఐవి.సుబ్బారావు స్పందించి విలేకరి కుటుంబాన్ని ఆదుకోవాలని రాష్ట్ర స్థాయిలో చొరవ చూపించడం అభినందనీయమని పలువురు విలేకర్లు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.దీనిలో భాగంగా పలువురు ఏపీయూడబ్ల్యూజే కి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వానికి పట్టని కార్మికుల గోడు

విశాలాంధ్ర - సీతానగరం: ప్రజలకు 25 రోజులుగా అందని త్రాగు నీరు. కార్మికులకు అందని. గత 25 రోజులుగా సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామంలో గల శ్రీ సత్యసాయి త్రాగు నీటి పథకం సిబ్బందికి 20 నెలల వేతనాలు, 25 నెలల ఎస్ఐ , పిఎఫ్ పెండింగ్లో ఉన్న కారణంగా 25 రోజులుగా నిరవదిక సమ్మె చేస్తున్నారు. శుక్రవారం 25వ రోజున రాజమహేంద్రవరం లాలాచెరువు సెంటర్లో ఆర్డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం దగ్గర సమ్మెను కొనసాగించారు. కార్మికులు మాట్లాడుతూ గత 25 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి కనపడడం లేదా వినపడడం లేదా అంటూ ప్రశ్నించారు. గుత్తేదారుడుకి మేలు చేసే విధంగా గత ప్రభుత్వంలో పెండింగ్ ఉన్న 28.30 కోట్ల రూపాయలు బిల్లులను కూడా ఇప్పుడు సమర్పించి గుత్తేదారుడుకి లబ్ధి చేరే విధంగా కనబడుతుంది బిల్లు చూస్తే బారెడు జీతాలు చూస్తే మూరెడు అన్నా చందాన ఉన్నాయి. ఇంత మొత్తంలో బిల్లులను చూపించడం వల్ల ఆ బిల్లులు అవుతాయో లేదో తెలియని పరిస్థితి అని వాపోయారు. ఇలాంటి పరిస్థితుల వల్లే ప్రతినెల జీతాలు రావడం లేదని జీతల బిల్లులు వేరు చేసి ప్రతి నెలా అప్లోడ్ చేసి ఔట్సోర్సింగ్ కార్పొరేషన్ ద్వారా పెడితే ప్రతీ నెలా జీతాలు వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. ప్రజలు తాగు నీరు కోసం పడరాని పాట్లు పడుతున్న ప్రభుత్వం కనీసం స్పందించడం లేదు అని ఆవేదన వ్యక్తం చేశారు. మా వేతనాలు మాకు చెల్లించి ప్రజలకు త్రాగు నీటి కష్టాలు తీర్చే విధంగా అధికారులు, నాయకులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్యసాయి త్రాగు నీటి పథకం కార్మికులు పాగొన్నారు.

పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - కాకినాడ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా సామాజిక భద్రత కింద అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛను కార్యక్రమం ఆగస్టు నెలకు సంబంధించి కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి జి వీరపాండ్యన్..జిల్లా కలెక్టర్ షణ్మోహన్, కాకినాడ కమిషనర్ భావన, ట్రైనీ కలెక్టర్ మానీషాలతో కలిసి పంపిణీ చేశారు. శుక్రవారం కాకినాడ 49వ వార్డులో నూతనంగా మంజూరైన స్పౌజు పింఛను కింద బొంతు అమ్మాజికి, వృద్ధాప్య పింఛన్లు అనసూరి లక్ష్మి, మేడిశెట్టి అమ్ములుకి ఫించన్ల సొమ్ము అందజేశారు. పెన్షన్ దారులతో మాట్లాడి రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాకినాడ జిల్లా ప్రత్యేక అధికారి జి వీరపాండ్యన్ మాట్లాడుతూ..పేదలకి సేవలు కార్యక్రమంలో భాగంగా అర్హత కలిగిన ప్రతి లబ్ధిదారునికి ఎన్టీఆర్ భరోసా పింఛనులను ఇంటి వద్దనే అందించడం జరుగుతుందన్నారు. ఆగస్టు నెలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా దాదాపుగా లక్ష మందికి వితంతు పింఛన్లను మంజూరు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు పట్ల పింఛన్లదారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు. డీఎంహెచ్ఓ డా జె నరసింహ నాయక్, కాకినాడ నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, ఇతర మున్సిపల్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛత అభియాన్ పక్షోత్సవాలు ప్రారంభం

విశాలాంధ్ర - సామర్లకోట : స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో భాగంగా రైల్వే స్టేషన్లో భారతీయ రైల్వేలు, రైల్వే బోర్డు ఆదేశాల మేరకు స్వచ్ఛత అభియాన్ (పరిశుభ్రత కార్యక్రమాలు) పక్షోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఆగస్టు 1 నుంచి 15 వరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఈ స్వచ్ఛత అభియాన్ పరిశుభ్రత కార్యక్రమాలు రైల్వే స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ ఆధ్వర్యంలో ప్రారంభించారు. రైల్వే ఉద్యోగులతో స్టేషన్‌లో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వచ్ఛత ర్యాలీ నిర్వహించి పరిసరాలను పరిశుభ్రంగా ప్రజలకు ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఇన్స్పెక్టర్ కళ్యాణి, స్టేషన్ సూపరింటెండెంట్ అనంత లక్ష్మీ, టికెట్ చెకింగ్ ఇన్స్పెక్టర్లు చైతన్య, రమణ, రిజర్వేషన్ సూపర్వైజర్ రాజు, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది, హౌస్ కీపింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

సంతూర్ రాయల్ సాండిల్ విడుదల

రాజమహేంద్రవరం: సంతూర్ రాయల్ సాండిల్ అనేది విప్రో వినియోగదారుల సంరక్షణ, కాంతి అనేది ఒక ప్రీమియం సంతూర్ పోర్ట్‌పోలియో కిందకి వస్తుంది. అది కొత్త ట్రిపుల్ సాండిల్ ప్యాక్‌ను పరిచయం చేస్తూ దాని చర్మ సంరక్షణ రేంజిని విస్తరించింది. సినీనటి మీనాక్షి చౌదరీ టీవీ కమర్షియల్ ద్వారా దీన్ని లాంచ్ చేశారు. ఈ కొత్త ఆఫర్ మూడు ఉత్పత్తులు అయిన సోప్, సాండిల్ వుడ్ ఫేస్ ప్యాక్, సాన్డిల్ ఫేస్ క్రీమ్‌లతో మనల్ని దగ్గరకు చేరుస్తుంది. మూడు దశల చర్మ సంరక్షణలో భాగంగా మెరుగైన పనితీరుని అందిస్తూ చర్మ సౌందర్యాన్ని పెంచుతూ నల్లమచ్చలను తగ్గిస్తుంది. ఎంఎస్ పరిశోధన క్లినిక్ నిర్వహించిన క్లినికల్ అధ్యయనం ప్రకారం ఒక వారం రోజుల వాడుక తరువాత మెరుగైన మురుగుదలని చూసామని రెజిమెన్ వివరించారు. టాన్ తగ్గడం మాత్రమే కాకుండా నాల్గవ వారంలో నల్ల మచ్చలు కుడా తగ్గి మంచి కాంతిని గమనించారు. ఈ ఫార్ములాని డెర్మటాలజీ ప్రకారం టెస్ట్ చేసారు. ఇది అన్ని రకాల చర్మాల వారికి సరిపోతుందని లైతెనింగ్ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఎస్ ప్రసన్న రాయ్ అన్నారు.

పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - కాకినాడ : పేద ప్రజల కళ్ళల్లో ఆనందం, వారి అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కాకినాడ సిటీ శాసన సభ్యులు వనమాడి కొండబాబు వ్యాఖ్యానించారు. శుక్రవారం జగన్నాధపురం గౌరీ శంకర్ పేట మరియు నేతాజీ పార్క్ నందు నిర్వహించిన కార్యక్రమంలో కొండబాబు పాల్గొని నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పెన్షన్‌లను లబ్ధిదారులకు అందచేసారు. కొండబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో పెన్షన్ల పంపిణీలో ఏపీ ప్రభుత్వం ఒక పండుగలా నిర్వహిస్తుందని, కుటుంబ పెద్ద చనిపోతే వెంటనే భార్యకు పెన్షన్ అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని గత ప్రభుత్వం కొత్త పెన్షన్లు మంజూరు చేసిన దాకలాలు ఎన్నడూ లేవని, కానీ లేదు కోటను ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పెన్షన్ మంజూరు విధానంలో కీలక మార్పులు తీసుకువచ్చి లబ్దిదారులకు పెన్షన్ అందేలా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంకితభావం, నిబద్ధత ఎన్డీఏ కూటమి ప్రభుత్వం లక్ష్యమని కొండబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాసరావు, శైలజ, స్థానిక డివిజన్ నాయకులు గడ్డం పూర్ణ చంద్రశేఖర రావు, మల్లాడి చిన్న, పాలిక నాని, పిర్ల లక్ష్మీ ప్రసన్న, మేడిశెట్టి చిన్ని, కొనాడ ప్రకాష్, సంఘాని నాగూర్, శాకా వెంకట్, రాళ్లపూడి ప్రకాష్, అయినవిల్లి పద్మ, డబ్బేరు జగదాంబ తదితరులు పాల్గొన్నారు.

మేనేజ్‌మెంట్ టీచర్లకు ఎంఈఓ -1 పదోన్నతి కల్పించాలి

విశాలాంధ్ర - కరప : ఉపాధ్యాయులుగా ఉమ్మడి డీఎస్సీలో సెలక్ట్ కాబడిన వివిధ యాజమాన్యాల కింద పనిచేస్తున్న మేనేజ్మెంట్ టీచర్లకు ఎంఈఓ వన్ పదోన్నతులను కల్పించాలని పిఆర్టియు జిల్లా సిపిఎస్ కన్వీనర్ వాకాడ వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో యూనియన్ సభ్యులతో నల్ల బ్యాడ్జీలు ధరించి రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు తెలియజేయడం జరిగిందన్నారు. మండల ఏపీయుఎస్, నాయకులు గోపి, మురళి, భ్రమరాంబ, రమాదేవి, శాంత, రాజసింహ వర్మ, వాజ్యంతి, ధన లీల తదితరులు పాల్గొన్నారు.

'ఫోరెన్సిక్స్' 7వ సంచిక విడుదల

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్ కళాశాల భారతదేశపు మొట్టమొదటి ద్వైమాసిక ఫోరెన్సిక్ సైన్స్ మేగజైన్ అయిన 'ఫోరెన్సిక్స్' యొక్క 7వ సంచికను కాకినాడలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్‌పి), కాకినాడ డివిజన్‌గా పనిచేస్తున్న దేవరాజ్ పాటిల్ (ఐపిఎస్) చేతుల మీదుగా విడుదల చేశారు. ఫోరెన్సిక్ కళాశాల ప్రిన్సిపాల్, మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ విలాస్ అనిల్ చవాన్ తెలిపారు. దేవరాజ్ పాటిల్ మాట్లాడుతూ మేగజైన్ రూపొందించడం అంటే ఎంతో సాహసంతో కూడుకున్న ప్రక్రియ అని దానికి ఎంతో నైపుణ్యం నేర్పు సబ్జెక్టుపై సంపూర్ణ అవగాహన అవసరమని ఇది 7వ ద్వైమాసిక ఫోరెన్సిక్ సైన్స్ మేగజైన్ కావడం అభినందనీయం అని ఎన్నో విషయాలు విద్యార్థులకు మాత్రమే కాకుండా సంబంధిత విభాగం అధికారులు ఉపాధ్యాయులు సైతం తెలుసుకోదగ్గ విషయాలు పొందుపర్చడం అభినందనీయమన్నారు. ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఫోరెన్సిక్స్ అండ్ సైబర్ సెక్యూరిటీ, సూరంపాలెం ప్రచురించిన ఈ మేగజైన్‌లో డీఎన్ఏ ఫోరెన్సిక్స్, డీప్‌ఫేక్ ఆడియో, సైబర్ క్రైమ్, ఫోరెన్సిక్ ఒడొంటాలజీ వంటి అనేక విభాగాలకు సంబంధించి అధునాతన పరిశోధ నతో పాటు, విద్యార్థులు, పరిశోధకుల రచనలు చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆదిత్య డిగ్రీ అండ్ పీజీ కాలేజ్, సురంపాలెం ప్రిన్సిపాల్ మరియు మ్యాగజైన్ చీఫ్ ఎడిటర్ విలాస్ అనిల్ చవాన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ తుషార్ కేసీ, మరియు సెంట్రల్ క్రైమ్ స్టేషన్, కాకినాడ పోలీస్ ఇన్స్పెక్టర్ వి కృష్ణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - గండేపల్లి : ఆగస్టు 1 శుక్రవారం తొలిరోజే 90% ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు లబ్ధిదారులకు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో కే చంద్రరావు తెలిపారు. గండేపల్లి మండలంలో అన్ని గ్రామాలలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపణి మధ్యాహ్నం గం.03.30 ని.లకు 90 శాతం, అనగా 8429 మందికి గాను 7521 మందికి పంపిణీ పూర్తి చేసినట్లు ఎంపీడీవో తెలిపారు. బదిలీలలో కొత్తగా వచ్చిన సచివాలయ సిబ్బందికి ముందు రోజే పెన్షన్ పంపిణీ పై తగు సూచనలు జారీ చేసి ఎటువంటి సమస్యలు లేకుండా పంపిణీ జరుగుటకు చర్యలు తీసుకొనుట జరిగినది. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కె చంద్రరావు మల్లేపల్లి, తాళ్ళూరు, ఉప్పలపాడు, జెడ్ రాగంపేట గ్రామాలలో పెన్షన్ల పంపిణీ పర్యవేక్షించి పింఛన్ లబ్ధిదారులకు ఇంటివద్దకు వెళ్ళి పింఛను సొమ్ము అందజేశారు.

ఎరువుల కోసం రైతుల తిప్పలు

విశాలాంధ్ర - సామర్లకోట : సామర్లకోటలో రైతు సేవా కేంద్రాల వద్ద ఎరువులు లభించకపోవడంతో రైతులకు తిప్పలు తప్పడం లేదు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి యూరియా ఎరువు లభించడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుండి వందలాది మంది రైతులు సేవా కేంద్రం వద్దకు చేరుకోగా ఇతర ఎరువులు మాత్రమే లభిస్తుండగా యూరియా అందుబాటులో లేకుండా పోయింది. తక్షణమే యూరియా ఎరువులు అందించాలని రైతులు కోరుతున్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : పేద ప్రజల కళ్ళల్లో ఆనందం, వారి అభ్యున్నతే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ రూరల్ మండలం పండూరులో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఒక్క రూరల్ నియోజకవర్గంలోనే 34,479 మందికి రూ.14 కోట్ల 85 లక్షల 41 వేలు సామాజిక, ఆర్థిక భద్రత కోసం ఈ నెల నూతనంగా కాకినాడ రూరల్ నియోజకవర్గంలో మొత్తం 534 స్పౌజ్ పింఛన్లకు రూ.21,లక్షల 36 వేలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

యువత ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి

యువతకు ఉపాధి కల్పిస్తూ రైతులు ఆధునిక పరికరాలతో వ్యవసాయం చేసే విధంగా ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని రూరల్ ఎంఎల్ఏ పంతం నానాజీ తెలిపారు. కాకినాడ రూరల్ మండలం పండూరు గ్రామంలో వ్యవసాయ శాఖ సహకారంతో కొనుగోలు చేసిన వ్యవసాయ డ్రోన్‌ను రూరల్ ఎంఎల్ఏ పంతం నానాజీ ప్రారంభించారు. పంతం నానాజీ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో నూతన ఆవిష్కరణలతో ఆధునిక పరికరాలు వినియోగిస్తూ సాగులో వృద్ధి సాధించేందుకు ఉపయోగపడతాయన్నారు. తిమ్మాపురం యూనియన్ బ్యాంక్ సహకారంతో ఈ డ్రోన్ కొనుగోలు చేసినట్లు, ఐదుగురు సభ్యులుగా ఏర్పడి గ్రామ సభ తీర్మానం ద్వారా ఎంపికైన వారు రెండు లక్షలు పెట్టుబడి పెడితే మిగిలిన ప్రభుత్వం ద్వారా అందజేస్తామని తెలిపారు. కాకినాడ రూరల్ నియోజకవర్గం కరప మండలంలో నాలుగు డ్రోన్‌లు, రూరల్ మండలంలో ఒకటి మంజూరు అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, వ్యవసాయశాఖ అధికా రులు, బ్యాంకు అధికారులు, కాకినాడ రూరల్ అగ్రికల్చర్ ఆఫీసర్, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఏ వన్ ఫిల్టర్ వాటర్, వాటర్ సర్వీసింగ్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట శివారు జాతీయ రహదారి వద్ద ఐ వీరబాబు, నూతనంగా ఏర్పాటు చేసిన ఏ వన్ ఫిల్టర్ వాటర్, వాటర్ సర్వీసింగ్ సెంటర్‌లను జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ చేతుల మీద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు స్వశక్తితో పైకి రావాలని ఉద్దేశంతో వీరబాబు నూతనంగా ఏర్పాటు చేసిన ఏ వన్ శుద్ధి చేసిన మంచినీరు పంపిణీ కేంద్రంతోపాటు వాటర్ సర్వీసింగ్ సెంటర్‌ని పెట్టి తను జీవిస్తూనే మరికొందరికి జీవనోపాధి కల్పించడం చాలా అభినందించదగ్గ విషయమని వీరబాబుని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి ఒక్కరూ స్వయం ఉపాధి పొందే విధంగా అడుగులు వేయాలని దానికి ప్రభుత్వం నుంచి కూడా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఈ కార్యక్రమంలో రాగంపేట సొసైటీ చైర్మన్ కందుల కొండయ్య చౌదరి (బాబ్జి), రాష్ట్ర ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, మురారి ఉప సర్పంచ్, క్లస్టర్ ఇంచార్జ్ జాస్తి వసంత్, ఉప్పలపాడు సర్పంచ్ అడబాల ఆంజనేయులు, టిడిపి యువనేత పాలచర్ల నాగేంద్ర చౌదరి, నీలాద్రి రావు పేట గ్రామ టిడిపి అధ్యక్షు కురుకూరి వీర వెంకట చౌదరి, కంటే సురేంద్ర, కందుల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాదర్బార్‌కు విశేష స్పందన

విశాలాంధ్ర - కాకినాడ : ప్రజల సమస్యల పరిష్కారంకోసం కొప్పవరంలోని ఎంపీ సానా సతీష్ బాబు కార్యాలయంలో శుక్రవారం 16వ ప్రజా దర్బార్ నిర్వహించారు. పింఛన్లు, విద్య, ఇళ్ల స్థలాలు, ఉపాధి, వైద్యం, తదితరాలకు సంబంధించి 38 అర్జీలు వచ్చాయని కార్యాలయ ఇన్చార్జి మేకా లక్ష్మణమూర్తి తెలిపారు. వాటిలో 10 అర్జీలను అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగిందని చెప్పారు. పార్లమెంటరీ శీతాకాలం సమావేశంలో రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు కాకినాడ జిల్లాకు సంబంధించిన పలు అంశాలను పార్లమెంట్లో చర్చించడం జరిగిందన్నారు. రాజ్యసభలో కాకినాడ జిల్లా పై అవగాహన కలిగిన ఎంపీ సానా సతీష్ బాబు పలు సమస్యలు పార్లమెంట్లో చర్చించడం పట్ల ప్రజలు ఎంపీ కార్యాలయానికి విచ్చేసి అభినందిస్తున్నారన్నారు. వారందరికీ ఎంపీ తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని మేకా లక్ష్మణ్ మూర్తి వివరించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి క్యాన్సర్ విభాగానికి ఆధునికరాలు పరికరాలు రానున్న నేపథ్యంలో బసవ తారకరం క్యాన్సర్ హాస్పటల్ చైర్మన్, హిందూపూర్ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సీఈఓ కృష్ణయ్య, తమ వంతు సహకారం అందిస్తామని ఎంపీ సానా సతీష్ బాబుకు వారు తెలియజేయడంతో ఎంపీ కార్యాలయం తరఫున, కాకినాడ ప్రజల తరఫున మేక లక్ష్మణమూర్తి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే ఎంపీ సానా సతీష్ బాబు సూచన మేరకు కార్యకర్తలకు కూడా ఒక రోజుని కేటాయిస్తూ వారి సమస్యలు కూడా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సులుకుర్తి వెంకటేశ్వరరావు, ఆనంద్ న్యూటన్, చింతపల్లి అర్జున్, నెక్కంటి శ్రీనివాస్, సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్, జున్నూరు బాబ్జి, ఐటిడి పి సతీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

95 శాతం పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - కరప : కరప మండలంలో ప్రభుత్వ అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను 95% పంపిణీ చేయడం జరిగిందని డిప్యూటీ ఎంపీడీవో సలాది వెంకట శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలానికి 11 339 పెన్షన్లు మంజూరు కాగా ఒక్కరోజే 10333 పెన్షన్లు లబ్ధిదారులకు అందించడం జరిగిందన్నారు. మండ లంలో భర్త చనిపోయిన వారికి 184 వితంతు పెన్షన్లను మండల జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి ఆధ్వర్యంలో అరట్లకట్ట, గొడ్డటిపాలెం, జెడ్ బ్యావారం, కొరుపల్లె, గ్రామాలలో గ్రామ సర్పంచులు కూటమ నాయకులతో కలిపి ఇవ్వడం జరిగిందని తెలిపారు.

శక్తి యాప్‌పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - కొత్తపేట : మండల పరిధిలోని పలివెల గ్రామంలో విద్యార్థులకు శక్తి యాప్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ బి కృష్ణారావు ఆదేశాల మేరక, కొత్తపేట డిఎస్పీ మురళి మోహన్ ఉత్తర్వుల మేరకు రావులపాలెం రూరల్ సిఐ విద్యాసాగర్, ఎస్సై సురేంద్ర అవగాహన సదస్సులో పాల్గొని విద్యార్థులకు మహిళలపై జరిగే గృహహింస, వరకట్న వేధింపులు, అత్యవసర సమయాల్లో శక్తి యాప్ యొక్క వినియోగం, అత్యవసర సమయాల్లో పోలీస్ సేవలు ఏ విధంగా వినియోగించుకోవాలి, 112 కాల్స్ యొక్క ప్రాధాన్యత, మహిళలపై జరిగే లైంగిక వేధింపులు, పిల్లల మీద జరిగే లైంగిక వేధింపులు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ అనే అంశంపై అవగాహన, మహిళలపై జరిగే సైబర్ నేరాలు మొదలగు అంశాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేసి విద్యార్థులకు విపులంగా తెలియజేయడం జరిగింది. డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే అనర్థాలు, ట్రాఫిక్, హెల్మెట్ పై అవగాహన కల్పించారు.

సుబ్బాలమ్మ దేవస్థానం చైర్మన్‌గా అప్పన వీరన్న

విశాలాంధ్ర - అమలాపురం : అమలాపురం పట్టణ గ్రామ దేవత సుబ్బాలమ్మ నూకాలమ్మ, రాజ్యలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం పాలకమండలి చైర్మన్ ఆర్యవైశ్యులకు కేటాయించిన సందర్భంగా అప్పన వీరవేంకటభైరవ స్వామి (వీరన్న)ని నియమిస్తూ ఉత్తర్వులు వెలువడిన సందర్భాన్ని పురస్కరిం చుకొని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనంద రావు, రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తిక్కిరెడ్డి నేతాజీని గురువారం ఉదయం కలిసి సాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ గౌరవాధ్యక్షుడు యెందూరి వేంట్రామయ్య, అధ్యక్షుడు నంబూరు సత్యనారాయణమూర్తి, కార్యదర్శి నంబూరు నరేష్, కోశాధికారి కొమ్మూరి వేంకటాచల ప్రసాద్, ముఖ్య సలహాదారు వరదా సూరిబాబు, సంఘ కార్యవర్గ సభ్యులు నూలు సూరిబాబు, శ్రీకాకుళపు రాంపండు, నూలు కృష్ణ, యర్రమిల్లి సత్తిబాబు, మామిడిపాక రమేష్, సింగం శెట్టి కుమార్, నూలు శ్రీనివాసు, పచ్చిగోళ్ళ సోమ రాజు, నూలు వాసు, యెందూరి చంటి, వాసవి క్లబ్ అధ్యక్షుడు తట్టపర్తి ప్రసాద్, కార్యదర్శి తటవర్తి సురేష్, కోశాధికారి తాటికొండ బుజ్జి చైర్మన్‌గా నియమింపబడిన అప్పన్న వీరన్న పాల్గొన్నారు.

వితంతు పెన్షన్ల పంపిణీ

విశాలాంధ్ర - మామిడికుదురు : ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు ద్వారా పేదలకు సామాజిక భద్రతతో పాటు జీవితానికి భరోసా ఏర్పడిందని అమలాపురం ఆర్డీవో మాధవి తెలిపారు. శుక్రవారం ఆమె పాసర్లపూడి గ్రామంలో నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్లు పంపిణీ చేశారు. పెన్షను తీసుకుంటూ భర్త చనిపోయిన మహిళలకు ఈ నెల నుంచి ప్రభుత్వం కొత్తగా పెన్షన్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కోనుకు ప్రేమజ్యోతి, టీడీపీ మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, బోనం బాబు, చుట్టుగుల్ల కిషోర్, బొక్కా త్రిమూర్తులు, పంచాయతీ సెక్రటరీ వాసు, కొల్లు ఏడుకొండలు పాల్గొన్నారు.

'తల్లి పాలు ముద్దు-డబ్బా పాలు వద్దు'

విశాలాంధ్ర - ప్రత్తిపాడు : తల్లి పాలు వారోత్సవాల సందర్భంగా ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సౌమ్య మైకేల్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు, మహిళలకు తల్లి పాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. "తల్లి పాలు ముద్దు-డబ్బా పాలు వద్దు" అనే సందేశంతో పౌష్టికత, శిశు ఆరోగ్యం కోసం తల్లి పాలే మొదటి ఔషధమని అన్నారు. ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆస్పత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

విశాలాంధ్ర - కాకినాడ రురల్ : స్థానిక అంగన్వాడీ కేంద్రాలలో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈక్రమంలో పండూరు సెక్టర్ పరిధిలోని పెనుమర్తిగ్రామం అంగన్వాడీ కేంద్రంలో సెక్టర్ డి సూపర్వైజర్ డి మణి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగస్టు 1 నుంచి ఆగస్టు 8 వరకు తల్లిపాల వారోత్సవాలను వారం రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిపాలు బిడ్డకు ఎంత అవసరమో తెలియజేయడమే ఈకార్యక్రమం ముఖ్య ఉద్దేశం అని ఆమె చెప్పారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లి పాలు తప్ప ఏ ఇతర ద్రవపదార్థాలు తాగించకూడదని తెలిపారు. బిడ్డ పుట్టిన గంటలోనే తల్లియొక్క పసుపు రంగు చిక్కటి పాలు (ముర్రుపాలు) అమృతం లాంటివని ఆమె పేర్కొన్నారు. వీటి ద్వారా బిడ్డకు అతిముఖ్యమైన పోషకాలు లభిస్తాయని తెలిపారు. తల్లి పాలలో వున్న పోషక గుణాలు మరి ఏ ఇతర పాలల్లో వుండవని స్పష్టం చేశారు. అనంతరం ఏఎన్ఎం స్వప్న, ఎంఎల్‌పిహెచ్ సునీత తల్లి పాల ఆవశ్యకత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బి రత్నం, కె చక్రపాణి, గర్భిణీలు, బాలింతలు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రాయితీలు పొందాలి

విశాలాంధ్ర -భీమవరం: ఆంధ్రప్రదేశ్ సహకార శాఖ చట్టం ప్రకారం సహకార సంఘాలను అభివృద్ధి చేయడం జరిగిందని దీనిలో భాగంగా చేపల వేట వృత్తిపై ఆధారపడిన మత్స్యకారులకు మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా సహకార శాఖ అధికారి సంకు మురళి కృష్ణ అన్నారు. అంతర్జాతీయ సహకార సంవత్సరంలో భాగంగా జిల్లా మత్స్య శాఖ కార్యాలయంలో మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు రికార్డులపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మత్స్య సహకార సంఘాల, విధులు, రికార్డుల నిర్వహణపై వివరించారు. ప్రతీ మత్స్య సహకార సంఘం పాలక వర్గ కమిటీ ప్రతీ 3 నెల కొకసారి పాలక వర్గ సమావేశాన్ని, 6 నెలల కొకసారి సంఘ మహజన సభను ఏర్పాటు చేసుకొని సంఘం యొక్క ఆర్థిక లావాదేవీలు, సంఘంలోని సభ్యులు యొక్క జీవన అభివృద్ధి కొరకు ప్రభుత్వం నుంచి లబ్ధి పొందే పథకముల గురించి చర్చించి తీర్మానించుకొని సంబంధించిన అధికారులకు సమర్పించుకొని లబ్ధి పొందాలని ఆయన సూచించారు. సంఘం యొక్క రాబడి, ఖర్చులను నగదు పుస్తకములో నమోదు చేసుకోవాలని వాటిని ప్రతీ సంవత్సరం సహకార శాఖతో వార్షిక ఆడిట్ చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారి ఆర్.వి.ఎస్.ప్రసాద్, కె.ఎస్.వి. నాగలింగా చార్యులు, జిల్లా మత్స్య సహకార సంఘ అధ్యకులు మైల వసంత రావు, ఉపాధ్యక్షులు బాలాజీ, సిబ్బంది పాల్గొన్నారు.

పీ-4లో పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలి

విశాలాంధ్ర -భీమవరం: సమాజంలో దిగువ స్థాయి పేద వర్గాల వారిని ఆర్థికంగా, బలోపేతం చేసేందుకు ప్రభుత్వం పీ-4 కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ఈ కార్యక్రమంలో పారిశ్రామిక వేత్తలు భాగం పంచుకోవాలని ఇన్చార్జి కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. పీ-4లో భాగంగా జిల్లా పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వశిష్ట సమావేశ మందిరంలో జిల్లాలోని వివిధ పరిశ్రమల యాజమాన్యాలతో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఇన్చార్జి కలెక్టర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మార్గదర్శకులు బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని వారికి చేయూ తనిస్తే వారు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. సమాజం ద్వారా సంపన్నులుగా ఎదిగిన వారు పేదలకు తమ వంతు సహాయం అందించడానికి ముందుకు రావాలని కోరారు. పేదరికంలేని సమాజాన్నితీర్చి దిద్దాలని ప్రభుత్వ సంకల్పం నెరవేరేలా ప్రతి ఒక్కరు భాగస్వాములై ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఇప్పటికే జిల్లాలో 1,700 మంది మార్గదర్శకులు రిజిస్టర్ చేసుకొని 35 వేల బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడం జరిగింది అన్నారు. జిల్లాలోని సంపన్న వర్గాలు ప్రకృతి వైపరీత్యాల సమయంలో మానవతా దృక్పథంతో, సేవాభా వంతో పేదలను ఆదుకునేందుకు ముందుంటారనే మంచి పేరు ఉందని, అదేవిధంగా ప్రభుత్వ పీ4 లక్ష్యసాధనకు తమ వంతు సహకారం అందించాలని ఇంచార్జ్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి పరిశ్రమల యాజమాన్యాలను కోరారు. పీ4లో అందరూ భాగస్వాములై పశ్చిమ గోదావరి జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉండేవిధంగా ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు స్పందిస్తూ పి4 లక్ష్యాన్ని తమ యాజమాన్యం దృష్టికి తీసుకువెళ్లి ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అయ్యేవిధంగా కృషి చేస్తామన్నారు. కార్యక్ర మంలో జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, సిపిఓ కంటిపూడి శ్రీనివాసరావు, మత్స్య శాఖ జాయింట్ డైరెక్టర్ నాగలింగాచార్యులు, ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి.స్వాతి, గోదావరి మెగా ఆక్వా ఫుడ్ పార్క్, ఆనంద మెరైన్, జయలక్ష్మి సీ ఫుడ్ స్, వాన్ బర్రి వెల్కమ్ ఫిషరీస్ వివిధ పరిశ్రమల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - కాట్రేనికోన : వర్షాలు, ఎండలు కాస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సూచించారు. కాట్రేనికోన మండల పరిధిలోని కందికుప్ప గ్రామ పంచాయతీ శివారు జమ్మి చెరువులో జర్వలకు గురై కోలుకున్న వారిని ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకుని, సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు కాచి వడపోసి తాగాలని, బయట ఆహార పదార్థాలు తీసుకోకుండా వేడి ఆహార పదార్థాలను తీసుకోవాల న్నారు. భోజనానికి ముందు చేతులు పరిశుభ్రత పాటించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడమే కాకుండా మురుగునీరు మళ్లించే చర్యలు చేపట్టి పరిశుభ్రతపై దృష్టి సారిస్తే ఆరోగ్య వంతంగా జీవించ వచ్చన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం ఫ్రై డే డ్రై డే కార్యక్రమం నిర్వహిస్తూ సూచనలు చేస్తున్నామన్నారు. మీకు ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి సమాచారం ఇచ్చి ఆరోగ్యం కాపాడుకోవాలని సూచిం చారు. సొసైటీ అధ్యక్షులు నూకల మూర్తి, విద్యా కమిటీ మట్టా శ్రీనివాస్, కాట్రేనికోన ఐటీడీపీ అధ్యక్షుడు విత్తనాల భార్గవ్, గ్రామ టిడిపి అధ్యక్షుడు గెద్దం అరుణ్ కుమార్, నాయకులు కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హ్యాండీక్రాఫ్ట్ స్టాల్ ప్రారంభం

విశాలాంధ్ర - కాకినాడ : జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ శాసన మండలి సభ్యులు కె నాగబాబు శుక్రవారం పిఠాపురం నియోజకవర్గంలో పర్యటించారు. భారత ప్రధాని నరేంద్ర మోదీ చాలా ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన “వన్ స్టేషన్-వన్ ప్రోడక్ట్” పథకంలో భాగంగా సెర్ప్ విభాగం వారిచే పిఠాపురంలో ఏటికొప్పాక బొమ్మలతో ఏర్పాటు చేసిన హ్యాండీక్రాఫ్ట్ స్టాల్ నాగబాబు చేతుల మీదుగా ప్రారంభించారు. వీర మహిళ పిల్లా రమ్య జ్యోతి ఆధ్వర్యంలో ఈ స్టాల్ ఏర్పాటైంది. పిఠాపురం పట్టణం ఇందిరానగర్‌లో జనసేన వీరమహిళ పిట్ట ముని ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో దగ్ధమైన నేపథ్యంలో స్థానిక జనసేన నాయకులు జ్యోతుల శ్రీనివాస్ సహకారంతో పునర్నిర్మించిన ఆ ఇంటిని నాగబాబు చేతుల మీదుగా అందజేశారు. అనంతరం జగ్గయ్య చెరువు కాలనీ పాత సచివాలయం దగ్గర జరిగిన పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని నాగబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేశారు. వ్యవసాయ ఆధారిత పనుల కోసం ఉపయోగించే ఫెర్టిలైజర్ డ్రోన్ పని చేసే విధానాన్ని పిఠాపురంలో శిక్షణ పొందిన యువకులను నాగబాబు అడిగి తెలుసుకున్నారు. పిఠాపురం నియోజకవర్గం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, గోదావరి తూర్పు ప్రాజెక్ట్ చైర్మన్ మురాలశెట్టి సునీల్ కుమార్, ఏఎంసీ చైర్మన్ వాకపల్లి దేవి ప్రకాష్, ఏలూరు ప్రాజెక్టు వైస్ చైర్మన్ ఊట నాని బాబు, పిఠాపురం కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ చల్లబోయిన ప్రమీల నాగేశ్వరరావు, నాయకులు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, చల్లా లక్ష్మి, తలగంశెట్టి వెంకటేశ్వరరావు, చెల్లిబోయిన సతీష్ కుమార్, లాజర్ బాబు, మత్స అప్పాజీ, పిల్లా శివ, వీర మహిళలు, జన సైనికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మౌలిక సౌకర్యాలు కల్పించాలి

విశాలాంధ్ర - అమలాపురం : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామంలో ఉన్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల బాలుర, బాలికల పాఠశాలల విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, గురుకులాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక నిధులు కేటాయించాలని, పారిశుధ్యాన్ని మెరుగు పరిచి విద్యార్థుల ఆరోగ్యాన్ని కాపాడాలని, ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక, ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి, సంఘం దళిత బహుజన మహిళా శక్తి, సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా దళిత ఐక్యవేదిక ఆధ్వర్యంలో శుక్రవారం గోడి గ్రామంలో ఉన్న రెండు గురుకుల పాఠశాలలను నాయకులు సందర్శించి విద్యా ర్థులను, అధ్యాపకులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కలిసి భోజనాలు చేసి నాణ్యతను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో దళిత ఐక్యవేదిక అధ్యక్షులు డిబిలోక్ ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, డిబిఎంఎస్ కన్వీనర్ కొంకి రాజామణిలు మాట్లాడుతూ ఈ సమస్యలను స్థానిక శాసనసభ్యులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. దళిత ఐక్యవేదిక చైర్మన్ డిబి లోక్, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు, డిబిఎంఎస్ జాతీయ కన్వీనర్ కొంకి రాజమణి, సాపే బాల రవి, జంగా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం అభివృద్ధి రెండు కళ్లు : ఎమ్మెల్యే

విశాలాంధ్ర - సామర్లకోట : కూటమి ప్రభుత్వానికి సంక్షేమము అభివృద్ధి రెండు కళ్లు అని పేద ప్రజల భద్రత కోసమే ప్రభుత్వ అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. సామర్లకోట మండలం హుస్సేన్ పురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేద కుటుంబానికి సూపర్ సిక్స్ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే చినరాజప్ప తెలిపారు. ఈ కార్యక్రమంలో నేతలు గుమ్మళ్ళ రామకృష్ణ, పాలకుర్తి శ్రీనుబాబు, తదితర కూటమి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ పరీక్షా ఫలితాల్లో బస్సు డ్రైవర్‌కు స్టేట్ 5వ ర్యాంకు

విశాలాంధ్ర - గండేపల్లి : 1న గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ట్రాన్స్‌ఫోర్ట్ విభాగంలో డ్రైవర్‌గా గత నాలుగు సంవత్సరాలుగా పనిచేస్తున్న గుర్రం రాముడు శుక్రవారం విడుదల చేసిన ఏపి కానిస్టేబుల్ పరీక్ష ఫలితాలలో స్టేట్ 5వ ర్యాంకు సాధించి ఉద్యోగానికి ఎంపికైనట్లు యూనివర్సిటీ డిప్యూటీ ఛాన్సలర్ డా మేడపాటి శ్రీనివాస రెడ్డి తెలి పారు. గుర్రం రాముడు తండ్రి రోజువారీ వేతనానికి పనిచేస్తూ తన కుమారుణ్ణి చదివించారు. రాముడు ఇంటర్, డిగ్రీ ప్రగతి కళాశాల యందు ఎంబిఏ ఆంధ్రాల్మ మ్మ కళాశాల కాకినాడ నందు పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నం చేస్తూ ఆదిత్య సంస్థలో గత నాలుగు సంవత్స రాలుగా డ్రైవర్‌గా పనిచేస్తున్న రాముడు కానిస్టేబుల్ పరీక్షల లో రాష్ట్ర స్థాయిలో 5వ ర్యాంక్ సాధించడం అభినందనీయం అని డా శ్రీనివాస రెడ్డి తెలియజేసారు. గుర్రం రాముడికి ఆదిత్య విద్యా సంస్థల అధినేత డా నల్లమిల్లి శేషారెడ్డి శుభాభినందనలు తెలియజేసి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.రాముడుకు ఆదిత్య యూనివర్సిటీ ప్రో ఛాన్సలర్ డా నల్లమిల్లి సతీష్ రెడ్డి, ఎన్ దీపక్ రెడ్డి, డా ఎమ్ శ్రీనివాస రెడ్డి ట్రాన్స్పోర్ట్ విభాగం సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఘనంగా నాగిడి జన్మదిన వేడుక

విశాలాంధ్ర - కాట్రేనికోన : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాజీ మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్ నాగిడి నాగేశ్వరరావు పుట్టినరోజు వేడుకలు కాట్రేనికోన ఆయన స్వగృహంలో శుక్రవారం ఘనంగా నిర్వహిం చారు. కూటమి నాయకులు, కార్యకర్తలు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేకును కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రభుత్వ విప్ ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ నాయకులు దాట్ల పవన్, సదిపల్లి సుబ్బరాజు, త్సవటపల్లి పల్లి నాగు, జంగా శ్రీనివాసరావు, త్సవటపల్లి శ్రీను, జొన్నాద రాజారావు, రంబాల రమేష్, గ్రంధి నానాజీ, మట్ట సూరిబాబు, రామలింగరాజు, పిఏస్ఎన్ రాజు, వాసంశెట్టి రాజేశ్వరరావు, విత్తనాల బుజ్జి,,ఎంపీడీవో వెంకటాచలం, పంచాయితీ కార్యదర్శి వివి సత్యనారాయణలు పాల్గొన్నారు.